శుక్రవారం
6-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 255
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రష్యాకు బేషరతుగా మద్దతిస్తాం: కిమ్

ప్యాంగ్యాంగ్: తమ మద్దతు ఎప్పుడూ రష్యాకు ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ప్రకటించారు. రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఉత్తర కొరియా పర్యటనలో భాగంగా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో కిమ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు బేషరతుగా సంపూర్ణ మద్దతును కిమ్ మరోసారి ప్రకటించారు. ఇద్దరు నాయకులు వ్యూహాత్మక భాగస్వామ్యం తదితర కీలకాంశాలపై చర్చించారు. కర్స్ ప్రాంతం పునర్నిర్మాణంపైనా మాట్లాడుకున్నారు. రష్యా తన సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకునేందుకు చేస్తోన్న పోరాటంలో అండగా ఉంటామని కిమ్ వెల్లడించారు.

బనకచర్ల రచ్చ!

ఆంధ్రా వర్సెస్ తెలంగాణ

- ముదిరిన జల ప్రాజెక్టు వివాదం
- రూ.80 వేల కోట్లతో ఏపీ ప్రభుత్వ ప్రణాళికలు
- కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు
- వ్యతిరేకించిన తెలంగాణ ప్రభుత్వం
- కేంద్రం చేతిలోనే కీలక నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనతో తెలుగు రాష్ట్రాల్లో జల వివాదం మళ్లీ ఉత్కంఠ రేపుతోంది. రెండు రాష్ట్రాల మధ్య విభేదాలకు తెరలేపే పరిస్థితి కల్పించింది. ఇప్పటికే ఉన్న సమస్యల పరిష్కారానికే దిక్కులేని పరిస్థితిలో మరో కొత్త వివాదాన్ని తెచ్చినట్లు విమర్శలున్నాయి. నదులు, జలాశయాల అనుసంధానం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ మొత్తం పొడవునా సాగు నీరు అందించే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మక గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం... బనకచర్ల ప్రాజెక్టుకు సంకల్పించింది. ప్రస్తుతం ఉన్న పెండింగ్ నీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా భారీ వ్యయంతో బనకచర్లను ప్రతిపాదించడాన్ని రాజకీయ, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అటు బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామంటూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో వివాదం ముదిరింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం ప్రాజెక్టును అడ్డుకుంటామనే సంకేతాలిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన అనంతరం తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న ఒప్పందాలు, ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు సానుకూల వాతావరణం నెలకొన్న తరుణంలో తాజాగా బనకచర్ల ప్రాజెక్టు వ్యవహారం చిచ్చురేపేలా మారింది. బనకచర్ల పనులను వేగంగా పూర్తి చేసే దిశగా సీఎం చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. గోదావరి నదికి వరద పోటెత్తే క్రమంలో నీరు సముద్రం పాలవుతోంది. ఆ నీటిని ప్రజా ప్రయోజనాల కోసం మళ్లించాలని ఏపీలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా వరద నీటిని రాయలసీమతో పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు మళ్లించాలని ప్రభుత్వం భావించింది. తద్వారా తాగు, సాగు నీటి అవసరాలు తీర్చవచ్చనే ఆలోచనలో ఉంది. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. మొదటి దశలో గోదావరి నీటిని పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా బేసిన్‌కు తీసుకువస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేస్తారు. అక్కడి నుంచి బనకచర్లకు నీటిని తీసుకువస్తారు. బనకచర్ల నీరు చేరిన తర్వాత, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో సహా మొత్తం రాయలసీమ జిల్లాలకు సాగు నీరు అందడమే లక్ష్యంగా నిర్ధారించారు.

రాయలసీమకు ముఖద్వారంగా బనకచర్ల

సముద్రంలోకి వదులుతున్న కనీసం 300 టీఎంసీల నీటిని మళ్లిస్తే రాష్ట్రాన్ని

- మిగతా 2 లో

బనకచర్ల అవసరం లేదు

- కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టు ప్రతిపాదన
- పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి అవసరం
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదన వెనుక కూటమి ప్రభుత్వం కుట్ర దాగి ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తీవ్రంగా ఆరోపించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వకుండా... పెండింగ్‌లో ఉన్న అనేక కీలక ప్రాజెక్టులను పట్టించుకోకుండా... అవసరం లేని బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని నారాయణ మండిపడ్డారు. తిరుపతి

- మిగతా 2 లో

చత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టు అగ్రనాయకుడు నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం(65) మృతిచెందాడు. అతడు సుధాకర్‌గా పార్టీలో ప్రసిద్ధి చెందాడు. అతడికి గౌతమ్, ఆనంద్, చంటి, బాలకృష్ణ, రామరాజు, సోమన్న అనే మారుపేర్లు ఉన్నాయి. ఆయన స్వస్థలం ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం. 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో ఉన్న సుధాకర్‌పై రూ.50 లక్షల రివార్డు ఉంది. 2004లో ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో మావోయిస్టు సీనియర్ నాయకులు ఉన్నట్లు భద్రతా దళాలకు పక్కా సమాచారం అందడంతో... డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున దళాలు-మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ నేలకొరిగాడు. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. బీజాపూర్ అడవుల్లో గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్దమొత్తంలో ఆయుధాలను స్వాధీనం

- మిగతా 2 లో

మహువా మొయిత్రా రహస్య వివాహం

న్యూఢిల్లీ: టీఎంసీ ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రా, బీజేడీ నేత పినాకీ మిశ్రా పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. జర్మనీలో సన్నిహితుల సమక్షంలో వీరిద్దరి వివాహం మే 30న రహస్యంగా జరిగింది. ఇద్దరికీ ఇది రెండవ పెళ్లి. మిశ్రాకు మొదటి భార్యతో ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. దానిష్ ఫైనాన్సియర్ లార్స్ బ్రోర్సన్‌కు విడాకులు ఇచ్చిన తర్వాత దాదాపు మూడేళ్లు జై అనంత్ దెహ్రాద్రితో కలిసి ఉన్న మొయిత్రా ఇప్పుడు మిశ్రాను వివాహమాడారు. పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణ నగర్ నుంచి మొయిత్రా రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొయిత్రా 1974లో అసోంలో జన్మించారు. రాజకీయాల్లోకి రాకముందు ఆమె

- మిగతా 2 లో

శర్మిష్ఠ పనోలీకి మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, న్యాయ విద్యార్థిని శర్మిష్ఠ పనోలీ((22)కి మధ్యంతర బెయిల్ లభించింది. 'ఆపరేషన్ సిందూర్'పై సామాజిక మాధ్యమాల్లో తన భావాలు వెల్లడించే క్రమంలో ఒక వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆమెకు కలకత్తా హైకోర్టు గురువారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో శర్మిష్ఠకు ఉపశమనం లభించినట్లయింది. మే 31న ఆమెను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేయడంతో తీవ్ర రాజకీయ

- మిగతా 2 లో

నిధుల సమీకరణపై దృష్టి

ప్రతి వారం మొబలైజేషన్ కేబినెట్ కమిటీ భేటీ

ఎప్పటి నిర్ణయాలు అప్పడే అమలు: భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-హైదరాబాద్: నిధుల సమీకరణపై అధికారులు దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. రిసోర్స్ మొబలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం గురువారం చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగింది. ఈ సబ్ కమిటీ సమావేశం ప్రతి వారం జరుగుతుందని, తాజా నిర్ణయాలు వేగంగా అమలు చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. వచ్చే వారం జరిగే సమావేశంలో అంశాల వారీగా సమీక్ష ఉంటుందని తెలిపారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నియమించాలని భట్టి విక్రమార్క సూచించారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజు, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, సీసీఎల్‌ఏ కార్యదర్శి నవీన్ మిట్టల్, మైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధ ప్రకాశ్ జ్యోతి, ఇలంబర్తి, ఆర్‌వీ కర్ణన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటదాం మానవాళికి మేలు చేకూరుద్దాం

సీపీఐ మాజీ ఎంపీ అజీజ్ పాషా

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా మానవాళికి మేలు చేకూర్చాలని సీపీఐ మాజీ ఎంపీ, ఆల్ ఇండియా తంజీమ్ ఇన్సాఫ్ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. జూన్ 5వ తేదీ గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇస్కఫ్ (ఇండియన్ సొసైటీ ఫర్ ఎపీస్ అండ్ కల్చరల్ అఫైర్స్), ఆల్ ఇండియా తంజీమ్ ఇన్సాఫ్ అధ్వర్యంలో సుందరయ్య పార్క్‌లో జరిగిన ప్రదర్శన, బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ 2019 నుంచి 2022 వరకు 5.8 మిలియన్ల చెట్లు నరికివేతకు గురవడంతో భారతదేశం అటవీ నిర్మూలనలో బ్రెజిల్ తర్వాత ప్రపంచంలోనే 2వ స్థానంలో ఉందని అన్నారు. ఉపగ్రహ సర్వేలో 11 శాతం పూర్తిగా పెరిగిన చెట్లు నరికివేయబడినట్లు తేలిందని వివరించారు. దక్షిణ భారతదేశంలో తెలంగాణ అత్యధికంగా ఉందని, ఇక్కడ 2014 నుంచి 2024 వరకు 11,422 హెక్టార్ల అటవీ భూమిని కోల్పోవడం జరిగిందని చెప్పారు. సుప్రీం కోర్టు జోక్యం కంచ గచ్చి బౌలిని కాపాడటానికి సహాయపడిందని, లేకుంటే వేలాది చెట్లను నరికివేసేవారని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం 1997 క్యోటో ప్రోటోకాల్, 2015 పారిస్ ఒప్పందం, సీవోపీ 29, బాకు సిఫార్సులను కచ్చితంగా అమలు చేయాలన్నారు. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల నుంచి ప్రపంచాన్ని కాపాడాలన్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతి పొందే ముందు రెండు చెట్లను నాటడానికి ముందస్తు షరతు బెంగళూరు మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన నమూనాను అనుసరించాలని

- మిగతా 2 లో

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జీఎంగా సందీప్ మాథుర్

న్యూఢిల్లీ: విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జీఎంగా సందీప్ మాథుర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను రైల్వే బోర్డు గురువారం జారీ చేసింది. సందీప్ మాథుర్ ప్రస్తుతం ఢిల్లీ రైల్వే సిగ్నల్ ఆధునికీకరణ ప్రాజెక్టు సారథిగా ఉన్నారు. విశాఖ రైల్వేజోన్‌పై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వచ్చేలా చూస్తామని విశాఖ ఎంపీ భరత్ తెలిపారు. వాల్తేర్ డివిజన్‌తో విశాఖ రైల్వే జోన్ ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే జోన్ పనులు వేగవంతమయ్యేందుకు ఇది కీలక చర్యగా ఆయన అన్నారు.

సర్కార్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నోటీసులు జారీ చేసింది. ఇటీవల రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడి మరణంపై రెండు వారాల్లో సమాధానం కోరింది. పోలీసుల వేధింపులు తాళలేక యువకుడు మరణించాడన్న మీడియా కథనాలను ఎన్‌హెచ్‌ఆర్‌సీ పరిగణనలోకి తీసుకుంది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న హక్కుల సంఘం... రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తెలంగాణ డీజీపీకి కూడా నోటీసులు పంపింది. ండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. మీడియా కథనాలు నిజమైతే, బాధితుడి హక్కులను తీవ్రంగా ఉల్లంఘించినట్లుగా భావించాల్సి వస్తుందని కమిషన్ పేర్కొంది.

ఏం జరిగిందంటే...టోలీచౌకికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ (35) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు. మరో మహిళతో సన్నిహితంగా ఉండటంతో అతడిని రెండో భార్య నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు పెరిగాయి. మే 13న పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా అది

- మిగతా 2 లో

తొక్కిసలాట ఎలా జరిగింది?

- కర్నాటక ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు
- సుమోటో విచారణ

బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 18 ఏళ్ల తర్వాత ఐపీఎల్ ట్రోఫీ గెలుచుకోవడంతో కర్నాటకవ్యాప్తంగా సంబరాలు జరిగాయి. బెంగళూరు స్టేడియంలో నిర్వహించిన విజయోత్సవంలో విషాదం చోటుచేసుకొన్నది. 11 మంది అభిమానులు మృతి చెందగా 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనకు నిర్లక్ష్యమే కారణమా లేక మరేమైనా కారణాలు ఉన్నాయా? ఇందుకు బాధ్యులు ఎవరు? తప్పు నిర్వాహకులదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ ఘటనపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల క్రమంలో కర్నాటక ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఎం.చిన్న స్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై వివరణ కోరింది. అడ్వకేట్ జనరల్ సమర్పించిన స్టేటస్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుంది. ఈ వ్యవహారంలో సుమోటో రిట్ పిటిషన్

- మిగతా 2 లో

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కాలుష్య రహిత తెలంగాణకు సమష్టి కృషి: పొన్నం ప్రభాకర్ పిలుపు
- గోల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటిన మంత్రి

విశాలాంధ్ర-హైదరాబాద్: మొక్కలు నాటుదాం... కాలుష్య రహిత తెలంగాణకు దోహదమవుదామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. హరిత తెలంగాణ-కాలుష్య రహిత తెలంగాణ కోసం సమష్టిగా కృషి చేద్దామన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన గురువారం గోల్కొండ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో

- మిగతా 2 లో

మన బంధం మరింత బలోపేతం

వియత్నాం ప్రతినిధులతో రాజా

2లో

ఇదీ లోకం!

అబ్బ! ఎంత బాగా సృష్టిస్తున్నారో!

గాజాలో శాశ్వత కాల్పుల విరమణ కోసం

ఐరాస తీర్మానం: వీటో చేసిన అమెరికా

వాషింగ్టన్/టెల్అవీవ్/ఐరాస: గాజాలో శాశ్వత కాల్పుల విరమణను డిమాండ్ చేసే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. సహాయ సామాగ్రి సరఫరాపై ఆంక్షలు తొలగింపునకూ పిలుపునిచ్చింది. హమాస్ నిరాయుధీకరణ, గాజా నుంచి నిష్క్రమణకు మద్దతివ్వని, హమాస్‌ను ఖండించని చర్యలకు మద్దతు ఇవ్వబోమని అమెరికా స్పష్టం చేసిందని ఐరాసకు అమెరికా రాయబారి దొరోతి షియా వెల్లడించారు. వాస్తవికతలకు అద్దంపడుతూ కాల్పుల విరమణ దిశగా జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలను నీరుగార్చేదిగా ఈ తీర్మానం ఉందన్నారు. 10 మంది తాత్కాలిక సభ్యదేశాలు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, 14 సభ్యదేశాలు అనుకూలంగా ఓటు వేశాయి.

అమెరికాకు కృతజ్ఞతలు: నెతన్యాహు

తన వీటో అధికారాన్ని అమెరికా వినియోగించడంతో అగ్రరాజ్యానికి ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఎక్స్ మాధ్యమంగా కృతజ్ఞతలు తెలిపారు. 'మా మధ్య పొద్దు పొడిచేందుకు ప్రసక్తే లేదని మా శత్రువులకు మరోమారు స్పష్టం చేసినందుకుగాను అమెరికాకు, డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు' అని ఆయన పేర్కొన్నారు. గాజా జైళ్లలో 58 మంది అమాయకులను బందీగా ఉంచిన హమాస్ ఉగ్రవాదుల వినాశనానికి ఇదొక్కటే మార్గం. తక్షణమే, బేషరతుగా బందీలను విడుదల చేయాలని నాగరిక ప్రపంచం డిమాండ్ చేయాలి' అని నెతన్యాహు ట్వీట్ చేశారు.

చైనా ఆగ్రహం: మానవతా సాయంపై ఆంక్షలు ఎత్తివేయడం, గాజాలో తక్షణమే కాల్పుల విరమణ కోసం డిమాండ్ చేస్తూ ఐరాస భద్రతా మండలి ముసాయిదా తీర్మానాన్ని అమెరికా వీటో చేయడాన్ని చైనా తీవ్రస్థాయిలో ఆక్షేపించింది. ఇది నిరాశపర్చిందని ఐరాసలో చైనా శాశ్వత ప్రతినిధి ఫూ కాంగ్ అన్నారు. గాజా ప్రజల ప్రధాన డిమాండ్లు ప్రతిబింబించే... అంతర్జాతీయ సమాజం గొంతు ప్రతిధ్వనించే ఈ తీర్మానాన్ని వీటో చేయడం ద్వారా గాజా ప్రజల చిరు ఆశలను అమెరికా మళ్లీ చంపేసిందని వ్యాఖ్యానించారు. క్రూరంగా రెండు మిలియన్ల మందికిపైగా ప్రజలను అంధకారంలోకి నెట్టివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సమాజం ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాజాలో ఘర్షణను ముగించడంలో భద్రతా మండలి అసమర్థత మరోమారు బహిర్గతమైందని, ఇజ్రాయిల్‌కు కవచంగా అమెరికా ఉందన్నారు. భద్రతా మండలి శాశ్వత సభ్యదేశంగా అమెరికా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇజ్రాయిల్ చర్యలు అంతర్జాతీయ మానవతా చట్టంలోని అన్ని రెడ్ లైన్‌లను దాటేశాయని, భద్రతా మండలి, జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని తీవ్రంగా ఉల్లంఘించాయని ఫూ కాంగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అగ్రరాజ్యం అండదండలతో దానిని నిలదీసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇటువంటి ద్వంద్వ వైఖరి, లక్షిత చర్యలను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. గాజాలో శాంతి నెలకొల్పేందుకు, మానవతా విపత్తును నియంత్రించేందుకు, 'టూ స్టేట్' అమలు చేసేందుకు, సమగ్రంగా న్యాయం చేకూరేందుకు, పలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అంతర్జాతీయ సమాజంతో కలిసి పని చేసేందుకు చైనా సిద్ధమని ఫూ కాంగ్ ప్రకటించారు.

ఆ 12 దేశాల వారు రావద్దు

- అమెరికాలోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ ట్రంప్ ఉత్తర్వులు
- మరో ఏడు దేశాల పౌరులపైనా ఆంక్షలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసా నిబంధనల్లో అనేక మార్పులు చేస్తున్నారు. తాజాగా 12 దేశాలపై నిషేధం విధించారు. మరో ఏడు దేశాలపైనా ఆంక్షలు పెట్టారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు చేశారు. అఫ్ఘానిస్థాన్, మైన్మార్, చాద్, రిపబ్లిక్ ఆఫ్ ది కాంగో, ఈక్వెటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించడానికి వీల్లేదని ట్రంప్ ప్రకటించారు. బురుండి, క్యూబా, లావోస్, సియోరా లియోన్, టోగో, తుర్క్మెనిస్థాన్, వెనిజులా వంటి మరో ఏడు దేశాలపై పాక్షిక నిషేధం విధించారు. ఈనెల 9వ తేదీ రోజు నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని వెల్లడించారు. తమ దేశంపై ఆంక్షలను వెనిజులా మంత్రి డియోస్డాడో కాబెల్లో ఖండించారు. అమెరికాలో ఉండటం మా పౌరులకే కాదు.. వేరే దేశాల ప్రజలకూ ప్రమాదకరమే అని అన్నారు. అమెరికాకు వెళ్లకూడదని, అక్కడ పర్యటించడాన్ని మానుకోవాలని తమ పౌరులకు పిలుపునిచ్చారు. కొలరాడోలోని బోల్డర్ కౌంటీలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ట్రంప్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సరైన పత్రాలు లేని విదేశీ పౌరులు ఉండటం వల్లే అమెరికాలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. 2017లో యూరప్‌లో జరిగిన విధంగా అమెరికాలో జరగనివ్వనని, ముప్పు దేశాల నుంచి బహిరంగ వలసలను అనుమతించబోనన్న ట్రంప్... 12 దేశాలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులపై సంతకాలు చేశారు.

2,200 మంది అరెస్టు: ఐసీఈ రికార్డు

అమెరికాలో వలసవాదుల వేటలో భాగంగా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు ఒకే రోజులో 2,200 మందిని అరెస్టు చేశారు. ఇది ఐసీఈ చరిత్రలోనే ఒక రికార్డు. ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టి నియోమ్ ఇటీవలే ఐసీఈ అధికారులకు కీలకాదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. రోజుకు 3వేల మంది వలసదారులను అరెస్టు చేయాలని చెప్పారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఐసీఈ అధికారులు ఆల్టర్‌నేటివ్ టు డిటెన్షన్ (ఏటీడీ) ప్రోగ్రామ్ కింద నమోదు చేసుకొన్న వారిని టార్గెట్ చేసుకొన్నట్లు తెలుస్తోంది. ఏటీడీలో నమోదైన వలసదారులను ఐసీఈ కార్యాలయానికి రావాలని అధికారులు సందేశాలు పంపిస్తున్నారు. అలా సందేహాలు అందిన వారు తమ వద్దకు రాగానే అరెస్టు చేస్తున్నారు. బేడీలు వేసి కార్లలో తరలిస్తున్నారు. అలా రాని వాళ్లు డిపోర్టేషన్‌కు గురవుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

మొక్కలు నాటారు. మంత్రి వెంట ఎంపీ సురేశ్ షేట్కర్, ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉన్నారు. భావితరాలకు మంచి పర్యావరణ అందించేందుకు మొక్కలు నాటాలని, కాదంటే వారికి ఆక్సిజన్ అందని పరిస్థితి ఉంటుందని మంత్రి పొన్నం హెచ్చరించారు. కాలుష్యం పెరిగి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తున్నాయని, మందులే ఆధారమవుతున్నాయన్నారు. హైదరాబాద్ మరో దిల్లీ కాకూడదని నొక్కిచెప్పారు. పచ్చదానికి మారు పేరుగా రాష్ట్రం ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించడానికి తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి పర్యావరణం, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్‌ను నిరోధించాలని, మొక్కలు పెంచడాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. పుట్టినరోజు వంటి ప్రత్యేక దినాల్లో మొక్కలు నాటాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లన్నారు. ప్లాస్టిక్‌కు బదులు జూట్ బ్యాగులు వాడాలని, కాలుష్య నివారణకు దోహదం కావాలని కోరారు. ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. గోల్కొండ ఆసుపత్రిలో రోజు 1,200-1,500 మంది రోగులు వస్తారని తెలిపారు. ఆసుపత్రి కొత్త భవనం నిర్మించేందుకు రూ.6 కోట్లు, యంత్రాల కొనుగోలు కోసం రూ.1.80 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.సురేష్, డీసీహెచ్‌ఎస్ సూర్యకుమారి, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

చత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

చేసుకొన్నారు. ఆరునెలల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన ముగ్గురు నాయకులను ఎన్‌కౌంటర్ చేయడం గమనార్హం. అలాగే, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇంఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ సీనియర్ నేత పాపారావు కూడా అక్కడే ఉన్నట్లు తమకు సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ప్రకటన జారీ చేశారు. ప్రకాశ్ మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లో కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇతడిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. పాపారావు గెరిల్లా యుద్ధతంత్ర నిపుణుడు. ఉచ్చులు పన్నడంలో దిట్టగా పేరుంది. చాలా ఐఈడీ, ఇతర దాడుల్లో అతడు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నాడు. అతడిపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరిద్దరికి సంబంధించిన సమాచారం వెల్లడి కాలేదు. కేవలం మూడు వారాల వ్యవధిలో మావోయిస్టులకు మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది.

శర్మిష్ఠ పనౌలీకి మధ్యంతర బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. గత శనివారం న్యాయస్థానం ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా... ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. కోల్‌కతాలోని ఆనందపూర్ ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పూనె న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. లింక్డిన్ ప్రొఫైల్ ప్రకారం ఆమెకు ఇన్‌స్టాలో 94 వేలమంది ఫాలోవర్లు ఉన్నారు. రాజకీయాలపై తనదైన శైలిలో వ్యాఖ్యలు జోడించి అభిప్రాయాలను బలంగా చెప్పడం ద్వారా శర్మిష్ఠ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సరుగా పేరు సాధించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ ప్రముఖుల మౌనాన్ని ప్రశ్నిస్తూ మే 14న పోస్టు చేసిన వీడియో తీవ్ర వివాదాస్పదమై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తన పోస్టులు, రీల్స్ తొలగించి ఆమె క్షమాపణ కోరారు. శర్మిష్ఠను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్లు పెరగడంతో పోలీసులు రంగంలోకి దిగి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆమెను గురుగ్రామ్‌లో అరెస్టు చేశారు.

మహువా మొయిత్రా రహస్య వివాహం

(మొదటిపేజీ తరువాయి)

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా పని చేశారు. 2010లో టీఎంసీలో చేరారు. 2019, 2024లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. మరోవైపు పినాకీ మిశ్రా 1959లో జన్మించారు. ఆయన సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదిగా పని చేశారు. 1996లో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన కాంగ్రెస్ తరఫున మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఒడిశాలోని పూరికి ప్రాతినిధ్యం వహించారు. అనంతరం సీనియర్ పార్లమెంటేరియన్ మిశ్రా బీజేడీలో చేరారు. దాదాపు దశాబ్దం తర్వాత పూరి నుంచి బీజేడీ తరఫున లోక్‌సభకు తిరిగి ఎన్నికయ్యారు.

మన బంధం మరింత బలోపేతం

న్యూదిల్లీ: వియత్నాం కమ్యూనిస్టు పార్టీతో ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం కావాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆకాంక్షించారు. రెండు పార్టీల మధ్య సమన్వయం మరింత పెరగాలన్నారు. ద్వైపాక్షిక బంధంతో వియత్నాం, భారత కమ్యూనిస్టు పార్టీలకు ఫలప్రదమైన ఫలితాలు కలుగుతున్నట్లు వెల్లడించారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు న్యుయెన్ ట్రోంగ్ నిహియా నాయకత్వంలో బృందం గురువారం దిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌ను సందర్శించింది. వీరితో పాటు భారత్‌కు వియత్నం రాయబారి న్యుయెన్ తాన్ హై ఉన్నారు. వియత్నాం ప్రతినిధులకు సీపీఐ కార్యదర్శులు పల్లబ్ సేన్ గుప్తా, రామకృష్ణా పాండా, అనీరాజా తదితరులతో కలిసి రాజా ఆత్మీయ స్వాగతం పలికారు. రెండు పార్టీల నాయకులు ఆలింగం చేసుకొని తమ సౌభ్రాతృత్వాన్ని చాటుకున్నారు.

అజయ్ భవన్‌లో మొక్కలు నాటిన నాయకులు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ నాయకులు పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో మొక్కలు నాటారు. వాతావరణ సంక్షోభం కోసం పోరాటం రాజకీయమే కాక నైతిక బాధ్యత కూడా అని రాజా పక్కాణించారు. భావితరాలకు మెరుగైన, సుస్థిర భవిష్యత్ అందించడం కోసం పోరాటాన్ని సీపీఐ కొనసాగిస్తుందని నొక్కిచెప్పారు. మొక్కలు నాటిన నాయకుల్లో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు పల్లబ్ సేన్ గుప్తా, అనీరాజా, రామకృష్ణా పాండా, కార్యాలయం కార్యదర్శి రాయ్‌కుట్టి తదితరులున్నారు.

మానవాళికి మేలు చేకూరుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన జీహెచ్ఎంసీ, ఇతర మునిసిపాలిటీలను కోరారు. ఇస్కఫ్ అధ్యక్షుడు ఆర్.గోపాల్ మాట్లాడుతూ ఊహించని రీతిలో వేడి గాలులు, వరదలు, తుపానులు తీవ్రతరం అవుతుండటం గ్లోబల్ వార్మింగ్ మొత్తం ప్రపంచానికి అతిపెద్ద ప్రమాద సంకేతమని భావిస్తున్నట్లు చెప్పారు. మన జీవితాలకు ఊహించలేని నష్టాన్ని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను ఒక్కసారి కూడా వాడవద్దని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుత వర్షా కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో మొక్కలు నాటాలని ఆయన నొక్కి చెప్పారు. ఇస్కఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ న్యాయవాది కె.ప్రభాకర్ రావు మాట్లాడుతూ అంటార్కిటికా, పచ్చని భూములలోని హిమానీనదాలు చాలా వేగంగా కరిగిపోతున్నందున ప్రస్తుత వాతావరణాన్ని మెరుగుపరచడానికి బహుముఖ విధానాన్ని నొక్కి చెప్పారు. తంజీమ్ ఇన్సాఫ్‌కు చెందిన మునీర్ పటేల్ మాట్లాడుతూ ప్రజా అవగాహనా ప్రచారం, సమాజ భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది విజయలక్ష్మి పాల్గొన్నారు.

సర్కార్‌కు ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ఎంతకీ తెగకపోవడంతో రెండు వర్గాలు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఆ తరువాత కొద్ది సేపటికే ఇర్ఫాన్ కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కొట్టడం వల్లే అతడు మరణించాడని ఇర్ఫాన్ సోదరుడు ఆరోపించాడు. ఇర్ఫాన్‌ను తాము కొట్టలేదని పోలీసులు తెలిపారు. పోలీసుల వేధింపులతో యువకుడు మృతి చెందాడని మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో ఈ వ్యవహారాన్ని ఎన్‌హెచ్ఆర్‌సీ సుమోటోగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది.

హరిత విప్లవం సృష్టికర్త కేసీఆర్

రేవంత్ అనాలోచిత చర్యలకు హెచ్‌సీయూ చెట్లు బలి: హరీశ్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో హరిత విప్లవాన్ని సృష్టించిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేసీఆర్ నాయకత్వంలో హరితహారం అమలును గుర్తుచేశారు. తెలంగాణలో పచ్చదానిన్ని 24 శాతం నుంచి 31శాతానికి పెంచినట్లు హరీశ్‌రావు తెలిపారు. గణాంకాల ప్రకారం తెలంగాణలో సుమారు 7.7శాతం వృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. హరితహారం కింద 250 కోట్ల మొక్కలు నాటి, రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పర్యావరణ పరిరక్షణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో హరిత నిధిని 53 శాతం తగ్గిందని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో చెట్లు నరికివేసి, పర్యావరణానికి, అక్కడి వన్యప్రాణులకు సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో నష్టం కలిగించారని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యావరణ విధ్వంసంతో పాటు పాలన నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. హెచ్‌సీయులోని అటవీ ప్రాంతాన్ని వెంటనే పునరుద్ధరించాలని, ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు.

నేటి నుంచి ఏపీ డీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకిగాను శుక్రవారం నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ సర్వం సిద్ధమైంది. ఈనెల 6 నుంచి జూన్ 30 వరకు జరగనున్న పరీక్షలకు మొత్తం 154 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజుకు రెండు విడతలుగా పరీక్షలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మెగా డీఎస్సీకి 3,35,401 మంది నుంచి 5,77,417 దరఖాస్తులు పోటెత్తాయి. ఇంతవరకు 3.04 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. మొత్తం పరీక్షలు పూర్తయిన తర్వాత మరుసటి రోజు ప్రాథమిక 'కీ' విడుదల చేయనున్నారు. అభ్యంతరాల స్వీకరణకు వారం గడువు ఇచ్చి, అనంతరం తుది ఆన్సర్ కీ రూపొందిస్తారు. అటు పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని, పరీక్షా కేంద్రానికి 90 నిముషాల ముందు చేరుకోవాలని డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ప్రకటించడంతో అభ్యర్థులు అప్రమత్తమయ్యారు. దూర ప్రాంత విద్యార్థులంతా ఒక రోజు ముందే ఆయా పరీక్షా కేంద్రాల ఉన్న నగరాలకు వస్తున్నారు. అభ్యర్థుల హాల్‌టికెట్లలో ఏమైనా తప్పులు ఉంటే ప్రభుత్వం జారీ చేసిన ఆధార్, ఓటరు ఐడీ, పాన్ తదితర గుర్తింపు కార్డులను పరీక్ష కేంద్రాల వద్ద సమర్పిస్తే... అక్కడి అధికారులు వాటిని సరి చేసేలా ఏర్పాటు చేశారు.

బనకచర్ల రచ్చ!

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిగా మార్చే ఈ గేమ్-ఛేంజర్ ప్రాజెక్ట్ సాధ్యమవుతుందనే ఆశయంతో చంద్రబాబు ఉన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును 'రాయలసీమకు ముఖద్వారం'గా అభివర్ణిస్తూ, ఈ కలల ప్రాజెక్టును సాకారం చేయడానికి రూ.80,112 కోట్ల పెట్టుబడిని కేటాయిస్తున్నట్లు సీఎం ఇటీవల ప్రకటించారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో కలిగే లాభాలను సైతం వివరిస్తూ కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ రాయడం, దానిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటామని ప్రకటన చేసింది. రాయలసీమలోని 80 లక్షల మందికి తాగునీటితో పాటు కొత్తగా మూడు లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరందించడం, నాగార్జున సాగర్ కుడి కాలువ, వెలిగొండ, తెలుగు గంగ, గాలేరు నగరి, కేసీ కెనాల్ కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర జల శక్తి శాఖకు ఏపీ ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. దానికి ప్రధాన మంత్రి కృషి సింఛాయ్ యోజన (పీఎంకేఎస్‌వై)-అక్సిలిరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాం (ఏఐబీపీ) కింద సహాయం అందించాలని కోరుతూ చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇంట్రా స్టేట్ లింక్ (రాష్ట్ర పరిధిలో అనుసంధానం) ప్రాజెక్టు కింద నిధులివ్వాలని, ఆ దిశగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోను సీఎం చర్చించారు. ఈ విషయాలను కేంద్రానికి రాష్ట్ర అధికారులు వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ విభజన చట్టం హామీలు చూస్తే... 11 ఏళ్లుగా పూర్తిగా అమలుకు నోచుకోలేదు. కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్డీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ అవి వేగవంతం కావడం లేదు. ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు వెనుకబడిన జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వలేదు. బనకచర్ల ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిపాదించడంతో ఏపీకి ప్రమాదం ఉందన్న వాదనలున్నాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమలో నిలిచిన ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, తక్షణమే వాటిని పూర్తి చేయాలని, పోలవరం ఎత్తు 45.72 మీటర్లపై సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాలన్న డిమాండ్లు ఉదయిస్తున్నాయి.

బనకచర్లపై తెలంగాణ ప్రభుత్వ వాదనలివీ...

ఏపీ ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల ప్రతిపాదిత ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఆ ప్రాజెక్టు ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టానికి వ్యతిరేకమని ఆరోపిస్తోంది. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా నాగార్జున సాగర్‌ను వినియోగించడాన్ని ప్రధానంగా తెలంగాణ తప్పు పడుతోంది. ఇప్పటికే ఆ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి... గోదావరి, కృష్ణా బోర్డులతో పాటు కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జలవనరుల సంఘం దృష్టికి తెలంగాణ అభ్యంతరాలు తీసుకెళ్లారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లకుండా నిరోధించాలని, టెండర్లు పిలవకుండా చర్య తీసుకోవాలని కోరాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు, జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖలు రాశారు. సెంట్రల్ వాటర్ కమిషన్, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలపకుండా చూడాలని ఆయన కోరారు. ఇదే వివాదంపై న్యాయ పోరాటం చేస్తామని, అవసరమైతే సుప్రీంలో పిటిషన్ వేస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించారు. అటు గోదావరి వరద నీటిని బనకచర్లకు తరలిస్తే తెలంగాణాకు ఎలాంటి నష్టం లేదని ఏపీ సీఎం చంద్రబాబు చెబుతున్నారు. నదీ ప్రవాహానికి సంబంధించినంత వరకూ ఏపీకి తెలంగాణ ఎగువ రాష్ట్రం... గోదావరిపై తెలంగాణ రాష్టం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినప్పుడు తాము అభ్యంతరం చెప్పలేదని చంద్రబాబు గుర్తు చేస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే డీపీఆర్ పూర్తి చేసి రెండు, మూడు నెలల్లో టెండర్లు పిలిచే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉండగా... దాన్ని అడ్డుకునే దిశగా తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. మొత్తంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనతో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలు సృష్టించే దశకు చేరింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేదీ ఉత్కంఠగా మారింది.

తొక్కిసలాట ఎలా జరిగింది?

(మొదటిపేజీ తరువాయి)

నమోదుకు ఆదేశించింది. ఈ ఘటన నివారించదగినదో కాదో పరిశీలిస్తామని సీజే వి.కామేశ్వరరావు, జస్టిస్ సీఎం జోషితో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని కర్నాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. స్టేడియంలో సముచిత భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ అంచనాలకు మించి అభిమానాలు రావడంతో ఈ ఘటన జరిగిందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ప్రవేశం ఉచితం కావడంతో బెంగళూరు నుంచే కాదు రాష్ట్ర నలుమూలల నుంచి 2.5 లక్షల మంది వచ్చారన్నారు. మరణాలన్నీ స్టేడియం వద్దనే సంభవించాయా అని కోర్టు ప్రశ్నించగా ప్రవేశ ద్వారాల వద్ద జరిగినట్లు ఆయన సమాధానం ఇచ్చారు. 'అందరి కంటే కూడా ఈ ఘటనపై మేము ఎక్కువగా మదన పడుతున్నాం. సీఎం తొలి ప్రకటన పరిహారం, వైద్యసాయంపై వెలువడింది. నిర్విరామంగా పనిచేస్తున్నాం. సలహాలు, సూచనలను స్వాగతిస్తాం' అని ఏజీ చెప్పారు. తదుపరి విచారణను ఈనెల 10వ తేదీకి వాయిదా వేస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

కేసు సీఐడీకి అప్పగింత

చిన్న స్వామి స్టేడియంలో తొక్కిసలాట వ్యవహారాన్ని సీఐడీకి అప్పగించారు. దర్యాప్తునకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేయనున్నట్లు కర్నాటక ప్రభుత్వం వెల్లడించింది. కోర్టుకు సమర్పించిన స్టేటస్ రిపోర్టులో ఈ మేరకు వివరించింది.

ఆర్‌సీబీ, కేఎస్‌సీఏపై కేసు

తొక్కిసలాటలో 11 మంది అభిమానులు చనిపోయిన ఘటనపై ఆర్‌సీబీ, కేఎస్‌సీఏ, డీఎన్ఏ ఎంటర్‌టైన్మెంట్‌పై కేసును బెంగళూరు పోలీసులు నమోదు చేశారు. స్టేడియంలో తొక్కిసలాట జరిగిన కొద్ది గంటల తర్వాత విక్టరీ పెరేడ్ జరుగుతుందన్న సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మేనేజ్‌మెంట్ విచారణను ఎదుర్కోనుంది. క్రికెటర్లకు సన్మాన కార్యక్రమంలో పోషించిన పాత్రపై కర్నాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) సీనియర్ సభ్యులనూ పోలీసులు విచారించనున్నారు. తొక్కిసలాట ఘటనపై సీఎం సిద్ధరామయ్య ఆదేశాలతో న్యాయ విచారణ క్రమంలో ఈ విచారణ జరగనుంది. బుధవారం మధ్యాహ్నం తొక్కిసలాట జరిగితే... సాయంత్రం 5 గంటలకు విక్టరీ పెరేడ్ జరుగుతుందని ఆర్‌సీబీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో ప్రకటించింది. ఉచిత పాస్‌లు ఇస్తామని, ప్రవేశాలు పరిమితంగా ఉంటాయని, పోలీసుల మార్గదర్శకాలను అభిమానాలు పాటించాలని ఆ పోస్టులో పేర్కొంది.

కేటీఆర్ చొరవతో స్వరాష్ట్రానికి బీఆర్ఎస్ కార్యకర్త భౌతికకాయం

విశాలాంధ్ర-హైదరాబాద్: బీఆర్ఎస్ శ్రేణులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మరోమారు భరోసానిచ్చారు. దేశం కాని దేశంలో గుండెపోటుతో మరణించిన కార్యకర్త భౌతికకాయాన్ని అతని కుటుంబసభ్యుల చెంతకు చేర్చడానికి సహకరించారు. మృతుడు రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్‌లో హేమ్లానాయక్ తండాకు చెందిన విస్లావత్ బాబ్య బీఆర్ఎస్, కేసీఆర్ వీరాభిమాని. ఓవైపు గులాబీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే బతుకుదెరువు కోసం వ్యవసాయం చేసుకునేవారు. బతకుదెరువు కోసం ఏడాది కిందట సౌదీ వెళ్లారు. గతనెల 27న గుండెపోటుతో అక్కడే చనిపోయారు. సౌదీ కఠిన నిబంధనలతో ఆయన భౌతికకాయాన్ని స్వస్థలానికి తేవడానికి కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఈ విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే భారత విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడి... విస్లావత్ బాబ్య భౌతికకాయాన్ని భారత్‌కు పంపేందుకు సహకరించాలని కోరారు. ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన సమాచారాన్ని దౌత్యకార్యలయానికి అందించారు. విదేశీ పర్యటనలో ఉన్నాగానీ అంజయ్య యాదవ్ నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకున్నారు. కేటీఆర్ చొరవతో విస్లావత్ భౌతికకాయం స్వగ్రామానికి చేరింది. కుటుంబ సభ్యులకు కడచూపు దక్కింది. గురువారం అంత్యక్రియలు జరిగాయి. తమకు అండగా నిలిచిన కేటీఆర్, అంజయ్య యాదవ్‌కు విస్లావత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బనకచర్ల అవసరం లేదు

(మొదటిపేజీ తరువాయి)

బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో లేని ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వం పదేపదే ఇప్పుడెందుకు మాట్లాడుతోందని నారాయణ ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లోనూ, మేనిఫెస్టోలోనూ ప్రస్తావించలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం, గాలేరు-నగరి నుంచి హంద్రీ-నీవాకు అనుసంధాన కాలువ, పోతిరెడ్డిపాడు వంటి కీలక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉండగా... వీటిని విస్మరించి బనకచర్ల ప్రాజెక్టుపై దృష్టి సారించడం వెనుక దాగిన ఉద్దేశాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు రైతులకు మేలు చేయదని, కేవలం కాంట్రాక్టర్లు, కార్పొరేట్ సంస్థల కమీషన్ల కోసమే ఈ ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు తెలంగాణ, కృష్ణా, గుంటూరు ప్రాంతాల ప్రజలు నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని నారాయణ హెచ్చరించారు. బనకచర్ల ప్రాజెక్టు అవసరం లేదని, దీనిపై ప్రభుత్వం తక్షణం పునరాలోచన చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు, ముఖ్యంగా రాయలసీమలో అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆయన కోరారు. రైతుల సంక్షేమం, సాగుకు దోహదపడే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్ల లాభాల కోసం ప్రజల హక్కులను తాకట్టు పెట్టే చర్యలను అడ్డుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి నూతన ఆర్‌ఓఆర్ రెవెన్యూ చట్టం 2025 ప్రకారం భూ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులు పాల్గొని భూ సమస్యల పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, చిన్న గూడూరు మండలం జయ్యారం, కురవి మండలం నేరేడ, సుదనపల్లి గ్రామాలలో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సుల కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రవేశ పెట్టిన భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ రెవెన్యూ చట్టం 2025 అని, ఈ చట్టం ద్వారా సామాన్య ప్రజలు రైతులకు భూ సమస్యల పరిష్కారానికి సరికొత్త విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్క రైతు ఈ సదస్సులో తమ సమస్యలను లిఖిత పూర్వకంగా ఇవ్వాల్సిందిగా కోరారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేయుటకు చర్యలు తీసుకుంటుందన్నారు. రెవెన్యూ సదస్సులకు హాజరయ్యి లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, దరఖాస్తు ఫారాలను ముందుగా అందించాలని ఆయన సూచించారు.

కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర- తొర్రూర్ : కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు, ఇతర అసంఘటిత రంగాల కార్మికులకు కనీస వేతనం 26000 ఇవ్వాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టి యు సి ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి రామయ్య అన్నారు. టియుసిఐ ప్రథమ జిల్లా మహాసభలు బుధవారం మహాసభలో ఆమోదించిన తీర్మాలను గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మిక కుటుంబం జీవించటానికి కనీస వేతనం 26,000 ఉండాలని, అర్జున్ సేన్ సింగ్ నివేదికను మోడీ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అన్నారు. దాని ప్రకారం వేతనాలు నిర్ణయించి అమలు చేయమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల విధానాల మూలంగా రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసర సరఫరా ధరలు ఇతర ఖర్చులు కార్మిక కుటుంబాలపై నేడు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. టియుసిఐ నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నికలో 19 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కొత్తపల్లి రవి, బిళ్ళ కంటి సూర్యం, ఉపాధ్యక్షులుగా జక్కుల యాకయ్య, పాడియా బికు, సహాయ కార్యదర్శులుగా కే సంపత్, అర్వపల్లి వెంకన్న కోశాధికారి పూజరి లచ్చయ్య కార్యవర్గ సభ్యులుగా చింత నవీన్, కోమిరే కృష్ణ, వేల్పుల మహేందర్, శ్రీరాం పుల్లయ్య పూనెం రవికుమార్, ల్యాదల్ల రాజు, కందాల యాకయ్య, బానోతు రామ్ లాల్‌లితో పాటు మరో నాలుగు ఆప్షన్ కు కేటాయించడం జరిగిందన్నారు. ఈ సభలోమహాసభలో పలు తీర్మానాలను చేయడం జరిగిందన్నారు. జూన్ 21 22 తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పోగుల శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందడం సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, టీయుడబ్ల్యు జే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం కురవి మండలం రాజోలులో శ్రీనివాస్ గౌడ్ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే మండల అధ్యక్షులు గుంటి సురేష్, సిపిఐ కురవి మండల కార్యదర్శి కర్నం రాజన్న, గీతపనివారల సంఘం జిల్లా నాయకులు బండారి రమేష్, కత్తి వీరన్న, సిపిఐ పార్టీ నాయకులు బుడమవెంకన్న, కన్నెం వెంకన్న, పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, వరిపెల్లి వెంకన్న తదితరులు రాజోలు గ్రామానికి వెళ్లి మృతుడు పోగుల శ్రీనివాస్ గౌడ్ మృతదేహంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

అక్రమ కేసులు ఎత్తివేయకుంటే ఆందోళన తప్పదు

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: అక్రమ కేసులు ఎత్తేయకుంటే ఆందోళన తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్‌లు అన్నారు. నాడు సాలార్ తండా గిరిజనుల భూములు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా లాక్కుంటుంటే వారికి మద్దతుగా సిపిఐ, సిపిఎం నేతలు గిరిజనులతో కలిసి ఆందోళన చేసిన సందర్భంగా నాటి ఉద్యమ కేసులో భాగంగా గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా వామపక్ష నేతలు, గిరిజనులపై కేసులు పెట్టిందన్నారు. నాడు నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం గిరిజనుల భూములు లాక్కుంటుంటే పెద్ద ఎత్తున వామపక్ష నేతలు వెళ్లి వారికి మద్దతుగా ఆందోళన నిర్వహించామని, దాని ఫలితంగా ఎకరాకు ఇరవై ఒక్క లక్ష రూపాయలు గిరిజనులకు వచ్చాయన్నారు. ఇది వామపక్ష పార్టీల విజయం అన్నారు. ఆ కేసుల కోసం కోట్ల చుట్టూ తిరుగుతున్నామని వెంటనే అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హాజరైన వారిలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, గిరిజనులు ఆంగోతు శివాజీ, సురేందర్, బాలాజీ మంగ్య, వెంకన్న హాజరయ్యారు.

కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి కేబినేట్ ఆమోదం

ఈ యూనివర్సిటీకి మాజీ ప్రధాని డా. మన్మోహన్‌సింగ్ పేరు ఖరారు

ముఖ్యమంత్రి రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెంలొ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ యూనివార్సిటికి దివంగత మాజీ ప్రధాని, ఆర్‌బిఐ మాజీ గవర్నర్, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ పేరును నామకరణం ఖరారు చేసారు. ఈ మేరకు గురువారం తెలంగాణ మంత్రిమండలి ఆమోదం తెలిపడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మార్చిందన్నారు. ఇపుడు మరో ముందడుగు వేసి యూనివర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం అభినందనీయమన్నారు.

300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం...

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా 300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం రూపు దిద్దుకుంది. అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారింది. ప్రస్తుతం ఈ మైనింగ్ కళాశాల మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందడంతో వేలాది మంది యువ శాస్త్రవేత్తలు ఇక్కడి నుంచి దేశ భవిష్యత్తుకు బాటలు వేయనున్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషించనున్నాయి. ఎర్త్ సైన్సెస్ విశ్వ విద్యాలయంలో వివిధ కోర్సులను అమలుతో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది. ప్రపంచంలోనే ఇలాంటి విశ్వవిద్యాలయం ఒక అమెరికాలో మాత్రమే ఉన్నది. యూనివర్సిటీలో అందించనున్న కోర్సులు యు జి (బి ఎస్ ఈ) ప్రోగ్రాంలో జుఅలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, పీజీ (ఎం ఎస్ సి) ప్రోగ్రాంలో జుఆలజి, ఎన్విరాన్మెంటల్ సైన్స్, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, పిహెడ్.డి ప్రోగ్రాంలో యూజీసీ నిబంధనల ప్రకారం కోర్సులను అందించడం జరుగుతుంది. ఇప్పటికే బి.టెక్ ప్రోగ్రాంలో ఇంజనీరింగ్ విభాగంలో అనేక కోర్సులు నిర్వహిస్తున్నారు. ప్రతి కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 780 సీట్లతో విద్యనందించడం జరుగుతుంది. కాగా మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడంలో మంత్రి తుమ్మల కృషి అపారమైంది. రాజకీయాల్లో అపర చాణిక్యుడిగానే కాకుండా అభివృద్ధి ప్రధాతగా, విజన్ కలిగిన నేతగా జిల్లాలో మంత్రి తుమ్మలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం తుమ్మల అహర్నిశలు శ్రమిస్తున్నారు. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విద్యాలయానికి ప్రపంచవ్యాప్తంగా పేరు మారు మ్రోగనుంది. కొత్తగూడెంలో బొగ్గుతో పాటు అన్ని సహజ వనరులు ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో ఖనిజనిధిగా కొత్తగూడెం జిల్లాకు పేరుంది. ఇక్కడి నేషనల్ హైవేకి సమీపంలో 300 ఎకరాల్లో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయానికి సమీపంలో మినీ స్టీల్ ప్లాంట్, నవభారత్ లిమిటెడ్, ఫెరో ఎల్లాయి, ఫెర్రో మెగ్నీషియం, విద్యుత్ ప్లాంట్ ఉన్నాయి. విద్యుత్ ప్లాంట్లు కూడా మరో 300 మెగావాట్ల సామర్ధ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతానికి సమీపంలో ఐటీసీ పేపర్ బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్ కూడా ఉన్నాయి. ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయాన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. రోడ్డు, రైలు రవాణా మార్గాలు ఈ ప్రాంతానికి అతి సమీపంలో ఉన్నాయి. 35 కిలోమీటర్ల దూరంలో గోదావరి నది ప్రవహిస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో నీటి ఇబ్బందులు కూడా ఉండవు. ఇలా ఆ యూనివర్సిటీ ఏర్పాటుకు అన్ని అర్హతలున్న ప్రాంతంగా కొత్తగూడెం ఉండటంతో మంజూరు లభించింది.

ఘనంగా వాసవి మాత దేవాలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి సాగర్ రోడ్‌లో గల వాసవి మాత దేవాలయంలో 14వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా గణపతి పూజ, అభిషేకం, శాంతి హెూమం శ్రీ లక్ష్మీనారాయణ కళ్యాణ వేడుకలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షులు సముద్రాల ధనయ్య, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి నరేందర్, కోశాధికారి కర్నాటి శ్రీనివాస్, తోట నరసింహ పూజారులు తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలలో విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: ప్రభుత్వ పాఠశాలలో అందే నాణ్యమైన విద్య పట్ల తల్లిదండ్రు లకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బడిబాట కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 10 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, 7 ఆదర్శ పాఠశాలలు, 361 ప్రాథమిక పాఠశాలలో, 83 అప్పర్ ప్రైమరీ స్కూల్స్, 104 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పరిధిలో విద్యా అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. బడి బాట కార్యక్రమం ద్వారా జూన్ 6 నుంచి జూన్ 19 వరకు ప్రభుత్వ పరిధిలో నడిచే వివిధ రకాల విద్యా సంస్థలో పిల్లలను జాయిన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో బడి బాట కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. గత సంవత్సరం బడిబాట కార్యక్రమం ద్వారా 2099 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని కలెక్టర్ గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మొదటి రోజే పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నామని తెలిపారు. 10,186 మంది నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమం కింద రిజిస్ట్రేషన్ చేసి వారికి విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 3 నుంచి 14 సంవత్సరాలు వరకు వయసు ఉన్నవారు తప్పనిసరిగా పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకోవాలని, ఆరోగ్య కారణాల వల్ల తీసుకోలేని పక్షంలో ఓపెన్ టెన్త్ పరీక్షలు రాయించాలని అన్నారు. జూన్ 12 న జరిగే సమావేశంలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల లక్ష్యాలు తల్లిదండ్రులకు స్పష్టంగా తెలిసేలా ముందు రోజే తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జెడ్ పి సి ఓ. నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, జి సి డి వో కవిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన తూంకుంట మున్సిపాలిటీ బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్- మల్కాజిగిరి : ఇంటి మ్యూటేషన్ (యజమాని మార్పు) కోసం దరఖాస్తు చేసుకున్న ఓ వ్యక్తిని తూంకుంట మున్సిపాలిటిలో పని చేస్తున్న శామీర్‌పేట్ వార్డు కార్యాలయంలో పని చేస్తున్న బిల్ కలెక్టర్ రామిరెడ్డి, ఇదే వార్డు కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ ఏ2గా ఎ.శ్రావన్‌లు డబ్బులు డిమాండ్ చేయగా రంగారెడ్డి జిల్లా యునిట్ ఏసిబి అధికారులు పట్టుకున్నారు. దరఖాస్తుదారుని నుండి రూ.20వేలు డిమాండ్ చేశారు. ఉద్యోగం చేస్తున్న అధికారులు లంచం అడగడంతో బాధితుడు ఏసిబి అధికారులను ఆశ్రయించారు. నిందితుల నుండి లంచం మొత్తాన్ని స్వాదీనం చేసుకుని, కేసు నమోదు చేసి హైదరాబాద్‌లోని నాంపల్లి వద్ద కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరు పర్చినట్లు ఏసిబి అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. బాధితులు ఎవరైనా ఫోన్ నంబర్ 1064 (టోల్ ఫ్రీ నంబర్)ఫిర్యాదు చేయాలని, తెలంగాణను సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఎసిబి), ఎక్స్/గతంలో ట్విట్టర్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. బాధితుడు/ఫిర్యాదుదారుడి పేరు, వివరాలు రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు. గ్రామ పంచాయితీ క్రమం నుండి కూడ ఇదే తంతు కొనసాగుతోందని, ఏసిబి ఫిర్యాదు చేయడానికి ఎవరు కూడ సహసించలేదని పలువురు పేర్కొంటున్నారు. ఎవరైనా తెలిసిన వారు వెళ్ళితే డబ్బులు రావని భావించి ఆ పని కాదని, ఉన్నతాధికారులను సంప్రదించాలని తప్పించుకునే ప్రయత్నం చేస్తుంటారని స్థానికులు పేర్కొంటున్నారు. వారికి అనుకూలంగా ఉన్నవారైతే ఈ విధంగా పనులు చక్కపెడుతుంటారనే ఆరోపణలున్నాయి.

ఎర్రబోడులో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాల పంపిణీ

విశాలాంధ్ర - కారేపల్లి : మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గురువారం అందచేశారు. ఎర్రబోడు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎర్రబోడు గ్రామపంచాయతీలో రాజకీయాలకు అతీతంగా పేదలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు ప్రభుత్వ పథకాలను అందిస్తూ అదర్శంగా నిలుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులది ఇది మొదటి జాబితా మాత్రమేనని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చేయటం జరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధికి గ్రామపంచాయతీ ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. ఇదే ఐక్యతతో అభివృద్ధిలో ఆదర్శంగా నిలవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి సొసైటీ మాజీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కడియాల సుధాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూక్యా వెంకన్న, బోజడ్ల వెంకట్రావు, తమ్మిశెట్టి యాలాద్రి, కొండ జ్యోతిబాసు, కనికరపు నాగయ్య, గాదె ఉపేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర - తొర్రూర్: తొర్రూరు మున్సిపల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునుకుంట్ల నర్సయ్య(బట్టి) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డిల ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీ రెడ్డిల సహకారంతో ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు బాధిత కుటుంబాన్ని అందించి, అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మాజీ సర్పంచులు పెదగాని సోమయ్య, చాపల బాపురెడ్డి, సీనియర్ నాయకులు ఎన్. ప్రవీణ్‌రావు, డాక్టర్ పొనుగోటి సవేశ్వరరావు, మాజీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జలకం శ్రీనివాస్, ముత్తినేని శ్రీనివాస్, గంజి దేవేందర్ రెడ్డి, అలువాల సోమయ్య, బసన బోయిన రాజేష్ యాదవ్, చిదిరాల రవి, కుమార్, అరుణ్ కుమార్, సోమ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దందా అరికట్టాలి

విశాలాంధ్ర - ఖమ్మం : ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం గురువారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ సూపరిటెంట్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పర్మిషన్స్ లేకపోయినా అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలను దండుకుంటున్నాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో మా కళాశాలలో అడ్మిషన్లు అయిపోయాయని బోర్డు పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలతో ఆ ఖాళీలో చదవాలనుకునే విద్యార్థులకు ఫీజులు రెండింతలు పెంచి సీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఫీజులో నియంత్రణ చట్టం అమలు సరిగా జరగకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని అది ప్రైవేటు విద్యా సంస్థలకు వరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని సమగ్రంగా అమలు చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. అదే సందర్భంలో ప్రైవేటు ఫీజులను కట్టడి చేస్తూ ప్రభుత్వ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని ఆయన కోరారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. శిథిలా వస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని సంఘం ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేస్తుందన్నారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శిలు షేక్ నాగులమేరా శివనాయక్. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించి నార సంచులు వాడాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్లాస్టిక్ వల్ల పర్యావరణం చాలా దెబ్బతింటుందని దాని బదులు నారా సంచులు లేదా పేపర్ వస్తువులను వాడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. గ్రీన్ ర్యాలీని సింగరేణి మహిళా కళాశాల నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ కొత్తగూడెం బస్టాండ్ మీదుగా ఐ.ఎం.ఏ హాల్ వరకు నిర్వహించినారు. ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందన్నారు. కొత్తగూడెం పర్యావరణ ఇంజనీర్ బి.రవీందర్ టోపీలు, నారసంచులను విడుదల చేసి ర్యాలీలో పాల్గొన్న వారందరికీ పంచారు. ఈ ర్యాలీలో కేటీపీస్, సింగరేణి ఎన్విరాన్మెంట్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర ఉమ్మడి జిల్లా పరిశ్రమల ప్రతినిధులు, సింగరేణి కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అంతం చేద్దామనే ఉద్దేశంతో ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాన్ని జరుపుతారని స్థానిక ఐఎంఎ హాల్లో జరిగిన సదస్సులో రవీందర్ చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించకుంటే రాబోయే కాలంలో ప్రకృతి వినాశకాలు తప్పవని హెచ్చరించారు. ఈ సదస్సులో డా.పావని, కెటిపిఎస్ చీఫ్ ఇంజనీర్స్ ప్రభాకరరావు, శ్రీనివాస బాబులు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే చర్యలను గురించి, ప్రాముఖ్యతను వివరించారు.

బెస్ట్ అవైలబుల్ విద్యా పథకాన్ని ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ప్రయివేట్ విద్యాసంస్థల్లో బహుజన విద్యార్థులకు అవకాశం కల్పించాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ అభ్యర్థించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని ఉపయోగించుకొవాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతిలో డేస్ కాలర్, 5వ తరగతిలో హాస్టల్ విద్యార్థులుగా చేరి ప్రైవేట్ స్కూళ్లలో కూడా బడుగు వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకం ద్వారా ఉచితంగా విద్యను అందిస్తుందన్నారు. ఈ పథకం కింద మరిన్ని కార్పొరేట్ విద్యాసంస్థలను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలొ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ చొరవ చూపాలని కోరారు. జిల్లాలో నవభారత్ పబ్లిక్ స్కూల్, సారపాకలోని ఐటిసి కంపెనీ స్కూల్, చర్లలో ఉన్న రాహుల్ విజ్ఞాన్ స్కూల్‌తోపాటు సెయింట్ మేరీస్ లాంటి ప్రముఖ విద్యాసంస్థల్లో కింది వర్గాల పిల్లలకు చదివే అవకాశం కల్పించాలని కోరారు. ఈ పథకం కింద ఫీజు రియంబర్స్మెంట్ ఒకటవ తరగతికి రూ.28 వేలు, 5వ తరగతి హాస్టల్ విద్యార్థులకు రూ. 51000 వేలను ప్రభుత్వం నేరుగా ప్రిన్సిపాల్ అకౌంట్లో జమ చేస్తారని శివశంకర్ తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూసే బాధ్యత తనదని మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కనీసం పది వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు కావాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులైన నిరుపేదలందరికీ ఇల్లు వచ్చేలా కృషి చేస్తానని, నిరుపేదలు అందరికీ ఇండ్లు ఇచ్చే బాధ్యత తనదని తెలిపారు. ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకంగా ఉండాలని, ప్రభుత్వం ఇంటి కోసం మంజూరు చేస్తున్న 5 లక్షల రూపాయలు సరిపోవని, ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి నల్గొండ జిల్లాలోని అన్ని సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నందున డిస్కౌంట్‌పై సిమెంట్ ఇచ్చే విధంగా లబ్ధిదారులకు మేలు జరిగేలా మాట్లాడతానని తెలిపారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పూరి గుడిసెలో నివసిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం సంతోషమని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఇల్లు అనేది ఇల్లు మాత్రమే కాదని, ఆత్మ గౌరవం పెంచే కార్యక్రమం అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా తయారు చేశామని, ఇందుకుగాను 200 మంది లబ్ధిదారులకు ఒక గజటెడ్ అధికారిని నియమించి జాబితాను పరిశీలించి జిల్లాస్థాయిలో వచ్చిన జాబితాను 5శాతం ర్యాండం పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు.

నావికాదళం సబ్ లెఫ్టినెంట్ అధికారిగా అబూబకర్

విశాలాంధ్ర - ఖమ్మం : స్థానిక శుక్రవార్ పేటకు చెందిన మహ్మద్ అబూబకర్ రెండు రోజుల క్రితం భారత నావికా దళంలో సబ్ లెఫ్టినెంట్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదిగిన అబూబకర్‌లు పలువురు అభినందిస్తున్నారు. అతడి తండ్రి గౌస్ వృత్తిరీత్యా ప్రైవేట్ ఎలక్ట్రిషన్. అబూబకర్ పదో తరగతి వరకు ఖమ్మం నగరంలోని ఆక్స్ఫర్డ్ స్కూల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, ఇంటర్మీడియట్ వికారాబాదులో గల హైదరాబాద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సెన్స్ కాలేజ్‌లో చదివారు. ఇంజనీరింగ్ హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎంజేసీఈటీ) నుండి 2022 సివిల్ ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణత సాధించారు. అబూబకర్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ ఎస్ బి)లో అర్హత సాధించారు. కేరళలోని ఎజిమలలోని ఇండియన్ నావల్ అకాడమీలో కఠిన మైన శిక్షణ పొందారు. ఈ సంవత్సరం మే 31న పాసింగ్ అవుట్ పెరేడ్‌లో పాల్గొన్న ఆయన నావికాదళంలో అధికారిగా చేరారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన కఠోర శ్రమ, ఒకవైపు చదువుతో పాటు మరోవైపు క్రీడల్లోనూ రాణించడం వల్లనే తనకు ఈ అవకాశం లభించిందని అబూబకర్ పేర్కొన్నారు. తన జీవిత ప్రస్థానంలో స్కూలు, కళాశాల యాజమాన్యాల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. అదేవిధంగా తన ఎదుగుదల, అనుకున్న లక్ష్యం చేరుకునే విషయంలో తల్లిదండ్రులు తనకు మార్గదర్శకులుగా వ్యవహరించారని తెలిపారు.

ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్ నాస్‌డాక్‌లో ప్రవేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశ వైద్య సాంకేతికతను ప్రపంచ పటంలో నూతన శిఖరానికి చేరుస్తూ దేశీయంగా అభివృద్ధి చేసిన ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ రూపొందించిన ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్ న్యూయార్క్ నగరంలోని నాస్‌డాక్‌లో ఓపెనింగ్ బెల్ మోగించింది. ఈ కంపెనీ షేర్లు నాస్‌డాక్‌లో 'ఎస్ఎస్ఐఐ' గుర్తుతో నమోదు అయ్యాయి. ఈ సందర్భంగా ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓ డాక్టర్ సుధీర్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఇది భారతదేశానికి ఒక గర్వకారణం అన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతల అభివృద్ధిలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. భారత మూలాలకు ఆరోగ్య పరిరక్షణ పరిష్కారాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని దీనితో స్పష్టమవుతుందని చెప్పారు. మా క్లినికల్‌గా నిర్ధారిత, పేటెంట్ పొందిన ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ ద్వారా గణనీయమైన పురోగతిని సాధించామని తెలిపారు.

సంపాదకీయం

ఉన్నమాటంటే ఉలుకే మరి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 లో మొట్ట మొదటిసారి ప్రమాణ స్వీకారం చేసినప్పుడు "సార్క్" దేశాల అధిపతులను ఆహ్వానించారు. ఇది అద్భుతమైన విదేశాంగ విధానం అన్న ప్రశంసలూ అందుకున్నారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఏమిటో కనీసం దిల్లీ పీఠాలపై అధిష్టించిన పెద్దలకైనా అర్థం అవుతోందో లేదో తెలియదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో, ఆ తరవాత కాల్పుల విరమణ ప్రకటించడంలో మోదీ ప్రభుత్వం అనుసరించిన పద్ధతి సర్వత్రా విమర్శలకు గురవుతోంది. పాక్ ప్రేరేపిత తీవ్రవాద స్థావరాలపై భారత రక్షణ దళాల దాడి నిర్ణాయక దశలో ఉన్నప్పుడు గత నెల పదో తేదీన అమాంతం కాల్పుల విరమణ ప్రకటించడం మోదీ భక్తులతో సహా అందరినీ అయోమయంలో పడవేసింది. తాను చెప్పినందువల్లే భారత్-పాక్ దళాలు కాల్పులు విరమించాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదే పనిగా చెప్పుకుంటున్నారు. ఈ విషయాన్ని మోదీ ప్రభుత్వం ఇంతవరకు ఖండించలేదు. ఈ అంశాన్ని ఆసరాగా చేసుకుని మంగళవారం ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ "సరెండర్" మోదీ అన్నారు. సరెండర్ అంటే లొంగిపోవడం. అమెరికా ఆదేశాలకు లొంగిపోయి కాల్పులు విరమించారని చెప్పడం రాహుల్ గాంధీ ఉద్దేశం. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత మోదీని విమర్శించడం, ప్రభుత్వాన్ని విమర్శించడం కూడా దేశ ద్రోహం జాబితాలో చేరిపోయాయి. మోదీనో, ప్రభుత్వాన్నో విమర్శించడం అంటే దేశాన్ని విమర్శించడం అని మోదీ భక్తులు ఒంటికాలి మీద లేస్తున్నారు. అలా ప్రభుత్వాన్ని విమర్శించే వారిని దేశాన్ని తూలనాడడంగా భావిస్తున్నారు. మరో వేపున త్రివిధ దళాల అధిపతి చౌహాన్ పాకిస్థాన్ సైనిక వ్యవహారాల అధిపతి కాల్పులు విరమిద్దాం అని ప్రతిపాదించినందువల్లే దాడి నిలిపివేశాం అంటున్నారు. కాల్పుల విరమణకు కారణం ఏమిటో ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క మాట కూడా చెప్పలేదు. మోదీ మాత్రం దేశమంతా తిరుగుతూ ఆపరేషన్ సిందూర్ తమ ఘనతేనని చాటుకుంటూనే ఉన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రతిపక్షాలకే కాదు దేశంలో అనేక మందికి అనేకానేక అనుమానాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రమే తన చొరవ వల్లే కాల్పుల విరమణ జరిగిందని అనేక సార్లు చెప్పుకుంటున్నారు. ఒకవేళ అదే నిజమైతే అది కచ్చితంగా లొంగుబాటే. ఇది మన విదేశాంగ విధానంలోని దివాలాకోరు తనానికి చరమ స్థాయి. రాహుల్ ఈ ఉద్దేశంతోనే "సరెండర్" మోదీ అన్నారు. పాకిస్థాన్ మీద దాడి చేయడానికి కేవలం పహల్గాం ఘాతుకం మాత్రమే కారణం అని మోదీ మాటలు వింటే నమ్మబుద్ధేయడం లేదు. తీవ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే. తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాల్సిందే. కానీ పుల్వామాలో తీవ్రవాదులు చేసిన దాడిలో మన భద్రతా దళాలకు చెందిన దాదాపు 40 మంది ప్రాణాలర్పించారు. అది పహల్గాం కన్నా పెద్ద సంఘటన. తేడా అల్లా అప్పుడు బలైంది భద్రతా దళాల వారైతే ఇప్పుడు తీవ్రవాదుల తూటాలకు నేలకొరిగింది అమాయక యాత్రికులు. యుద్ధంలో మన రక్షణ దళాలకు, మన ఆయుధ సంపత్తికి జరిగిన నష్టం గురించి ఎవరూ ప్రశ్నించడం లేదు. అమెరికా పనుపున కాల్పుల విరమణ నిజమే అయితే అది లొంగుబాటే గదా! ఈ ప్రశ్నలు వేటికీ ప్రభుత్వం నోరు విప్పి సమాధానం చెప్పదు. తీవ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్ ఆగడాల గురించి అంతర్జాతీయ సమాజానికి విడమర్చడం కోసం మోదీ ప్రభుత్వం పంపిన ఏడు బృందాలు తమ పర్యటనలో కాల్పుల విరమణకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాధ్యత ఏ మేరకు ఉందో చెప్తున్న దాఖలాలే లేవు. అలాంటప్పుడు రాహుల్ గాంధీ "సరెండర్" మోదీ అంటే ఉలుకెందుకో!

మోదీ ప్రభుత్వం తన లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ఇతరులను విమర్శించడం పరిపాటి అయింది. విమర్శకులపై "దేశద్రోహ" ముద్ర వేస్తోంది. మోదీ మీద, మోదీ ప్రభుత్వం మీద వస్తున్న విమర్శలను దేశాన్ని చులకన చేయడం, అపఖ్యాతిపాలు చేయడం కింద చిత్రిస్తోంది. ప్రధానమంత్రి విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఇక్కడి పార్టీల మీద దుమ్మెత్తి పోయడం మాత్రం మోదీకి, ఆయన భక్త బృందానికి తప్పుగా కనిపించలేదు. ఆపరేషన్ సిందూర్ విషయంలో బీజేపీ మాతృ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు అంతగా నచ్చినట్టు లేదు. ఆ నాయకులు నర్మగర్భమైన విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. తానే దేశానికి ఏకైక ప్రతినిధిని, తనను విమర్శించడం దేశద్రోహం అని భావించే తత్వం మోదీది. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని జాతి విద్రోహులుగా, వేర్పాటువాదులుగా, దేశ ద్రోహులుగా చిత్రించడం మోదీ హయాంలో 2016 నుంచే స్పష్టంగా కనిపిస్తోంది. 2016లో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, జాధవ్ పూర్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు "హం క్యా చాహ్తే-ఆజాదీ" అన్న నినాదాలను వక్రీకరించి మోదీ ప్రభుత్వం వారిని దేశద్రోహులుగా చిత్రించింది. కేసులు మోపింది. జైళ్ల పాలు చేసింది. ఇదంతా దేశమంటే తానేనన్న అహంభావం మోదీలో గూడు కట్టుకోవడంవల్ల కలిగిన అభిప్రాయమే. ఎంతటి మహత్తర నాయకుడైనా దేశం కన్నా తానే గొప్పవాడిని అనుకుంటే అది ఘనీభవించిన అహంకారానికి మాత్రమే చిహ్నం. దేశాన్ని ఓ మాతృమూర్తిగా అనుకుని భారతమాత అనొచ్చు. కానీ ఆ మూర్తి కన్నా మోదీ పెద్దవాడు అంటే మాత్రమే సహించే ప్రసక్తే లేదు. ఆ లెక్కన నిద్రలో కూడా నెహ్రూను తూలనాడి ఆనందపడిపోయే మోదీ కూడా మాజీ ప్రధానిని తప్పుపట్టడం కూడా ఆ లెక్కన అదీ దేశాన్ని విమర్శించడమో, దేశద్రోహమో కావాలిగా! మోదీ ఒక్క ట్రంప్‌కే కాదు చైనాకు కూడా లొంగి పోయారు. 2020 నుంచి చైనా నెమ్మది నెమ్మదిగా మన దేశంలోకి వందల మైళ్లు చొచ్చుకొచ్చి అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపడ్తోంటే మోదీ ఇప్పటికి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. విదేశాంగ మంత్రి జై శంకర్ అయితే "అమ్మో! చైనాతో ఎలా తలపడగలం!" అని ముందే దాసోహం అన్నారు. తాజాగా చైనా పాకిస్థాన్‌కు అండగా నిలబడితే మోదీగానీ, ఆయన ప్రభుత్వంలోని పెద్దలుగానీ నోరు విప్పిన పాపాన పోలేదు. బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా మొదలుకుని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ లాంటి ఛోటా మోటా నాయకులు కూడా రాహుల్ గాంధీ మీద దుమ్మెత్తి పోస్తున్నారు. మోదీ ఒక్క ట్రంప్ కే కాదు తన మిత్రుడైన అదానీకి ప్రయోజనం చేకూర్చడం కోసం ఎప్పుడో తాను లొంగి పోవడమే కాదు దేశ ప్రయోజనాలనే పణంగా పెట్టారు.మోదీ ప్రతి విదేశీ పర్యటనలో అదానీకి కాంట్రాక్టులు దక్కాయి. ఇది కేవలం అదానీకి లొంగి పోవడం కాదు. దేశాన్ని తాకట్టు పెట్టడమే.

దేవుడు అందరి వాడేనా?

దేవుడు అందరివాడా లేక కొందరివాడ. అందరి వాడయితే సమాజంలో అసమానతలు ఎందుకుంటాయి. ఇక నుంచి నేను దేవుణ్ణి నమ్మను బావ. రావయ్యా రోడ్డు మీదే మొదలుపెట్టావేంటి ఈరోజు. మొదలుపెట్టక ఏం చెయ్యాలయ్యా. ఉన్నవాడు లేనివాడు ప్రతి మనిషి దేవుణ్ణి నమ్ముతున్నాడు. కాని ఒక మనిషి చేతిలో మరో మనిషి మోసపోతున్నాడు. కాని ఆ యిద్దరూ దేవుణ్ణి నమ్ముతున్నారు. పూజలు చేస్తున్నారు. అపుడప్పుడు తిరుపతి వెళ్లి తలనీలాలు ఇచ్చి, ముకుళిత హస్తాలతో మొక్కి వారి స్థాయికి తగినట్టు హుండీలో కొంత నగదో, బంగారమో వేసి వస్తున్నారు. కాని వారిద్దరు బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఉన్నవాడు మరింత సంపాదిస్తే లేనివాడు మరింత దారిద్ర్యానికి దగ్గరవుతున్నాడు. నిజమేనయ్యా అసలు దేవుడంటే ఆయన సర్వాంతర్యామి. అణువణువున ఉంటాడు. ప్రహ్లాదుడన్నట్లు ఇందుకలడందు లేడని సందేహం అవసరం లేదు. ప్రతి ఇంట్లో ప్రతి మనిషిలో ఉన్నాడు. నమ్మిన వారికి ప్రతిచోట ఉంటాడు. ఎవరింట్లో వారు ధ్యానించుకోవచ్చు. ఒక్క తిరుమల కొండపైనే ఉండడు. అయినా ప్రతి పట్టణంలో ప్రతి గ్రామంలో దేవాలయాలు ఉన్నాయి కదా. పేదలు అప్పుచేసి తిరుపతి వెళ్లడం అప్పుతీర్చలేక బాధలు పడడం దేనికో అర్థం కాదు.

మోసం చేసి సంపాదించే వాడు దేవుని హుండీలో సంపాదించిన దాంట్లో కొంత నగదు వేసి తృప్తి పడతాడు. లేనివాడు ఇక నుంచైనా కష్టాల నుంచి గట్టెక్కించమని కోరుతాడు. కాని ఉన్నవారి కోరికలు తీర్చి మరింత సంపాదించే మార్గం చూపెడతాడు గాని లేనివాడి బతుకులో మార్పు రావడం లేదు. అందుకేనయ్యా దేవుడు అందరివాడు కాదు కొందరివాడే అంటున్నా. అసలు దేవుడు అనే పదం తప్పయ్యా. నిరాకారుడు, నిర్గుణుడు, నిర్వికల్పుడు అన్నారు. అంటే దేముడికి పక్కాగా ఒక ఆకారమంటూ లేదు. ఎవరు ఎలా ఊహించుకుంటే అలా కనపడతాడు. అలాగె నిర్గుణుడు. అంటే ఒకే గుణంతో ఉండడు. అంటే ఆస్తికులు భక్తుల రక్షణ కోసం దశావతారాలుగా మారాడంటారు. ఇకపోతే నిర్వికల్పుడు. అంటే ఆయనకు కోరికలు కల్పన ఉండవని భక్తుల అవసరార్థం కల్పనలు మారతాయని అవి తీర్చటమే ఆయన పని.

అది సరేనయ్యా ఆయన ఏ ఆకారంలో ఉంటే నాకెందుకుగాని దేవుడు అసలు లేడని అంటాను. ఒకవేళ ఉంటే ఆయన ఉన్నవారి వాడే గాని అందరివాడు కాదంటానే. అందరి వాడయితే నాకు ఈ దరిద్రం ఎందుకు చెప్పు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారికి అమ్ముడు పోతున్నాడు తప్ప పేదలకు అన్యాయం చేసే ప్రభుత్వంలో మార్పు తెచ్చే పని చేయడం లేదు. సంవత్సరాలు గడుస్తున్నా పేదల బతుకుల్లో మార్పు రాదు. అలాంటపుడు అందరి వాడని ఎలా చెబుతాం. ఖచ్చితంగా ఆయన కొందరివాడే.

అది కాదయ్యా ఏకాగ్రతతో దేవున్ని పూజించడానికో, దర్శించుకోవడానికో నిశ్శబ్ద వాతావరణంలో నదీతీరానో, కొండల పైనో దేవాలయాలు నిర్మించేవారు. ప్రస్తుతం నాలుగు రోడ్ల జంక్షన్లో, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న చోట్ల కూడ నిర్మాణం చేస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు యాక్సిడెంట్లు జరిగినా దేవాలయం కాబట్టి దాన్ని తొలగించరు. అసలు నిర్మాణం జరిగేటప్పుడే ఆపవచ్చు. కాని ఆ పని చేయరు. దేవుడంటే అందరికీ భయమే ఒక్క నాస్తికులకు తప్ప. నిత్యం సమాజంలో జరిగే మంచి చెడులు చూడటం వరకే భగవంతుని పని అంటారు. సమాజంలో ఉన్న చెడ్డవారికి మరు జన్మలో మానవ జన్మ ఇవ్వకుండా తగిన ఫలితం అనుభవిస్తాడని వేదాంతుల ఉవాచ. అసలు మరు జన్మలేదని, మానవ జన్మ చివరిదని, జంతువులుగానో, క్రిమికీటకాదు లుగానో పుట్టి న తరువాత ఏవరికీ హాని చేయకపోతే మానవ జన్మ లభిస్తుందని కూడ చెబుతారు. మరణాల కంటే జననాలు ఎక్కువగా ఉన్నప్పుడు పునర్జన్మ ఉందని ఎలా చెప్పగలం. కనుక మనిషికి మరుజన్మ లేదనే సంగతి శంకరుడు కూడా అంగీకరించి అద్వైతగా మారాడు. ఏదిఏమైనా మరు జన్మలేదని ఉన్నది మనిషికి ఒక జన్మేనని మంచి చెడులకు అన్నింటికి ప్రస్తుతమున్న మనిషే కారకుడని నాస్తికులంటారు. ఈ జన్మలో బాధలు అనుభవించి మంచి పనులు చేసి ఇతరులకు ఉపయోగ పడితే మరుజన్మలో జంతువులగానో, క్రిమి కీటకాదులుగానో పుట్టకుండా మానవ జన్మ లభిస్తుందనిఅధ్యాత్మిక వాదుల చెప్పేవన్ని బూటకమని నాస్తికులంటారు. పునర్జన్మ లేదని ఆదిశంకరుడే చెప్పినపుడు ప్రస్తుతం ఆధ్యాత్మిక వాదులు ఉండరని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని హేతువాదులంటారు.

అసలు సమాజంలో మనుగడ సాగించడం దానికి కులం, మతం, దేవునితో పనిలేదు. అయితే నిత్యం జరిగే ప్రతి చర్యకు మనిషే కారణం. మంచి జరిగినా చెడు జరిగినా అది మనిషి వలనే. అయితే కొందరిలో ఒక పని చేసేటప్పుడు అవుతుందో లేదో అనే సందేహం భయం కలుగుతుంది. అప్పుడే దేవుడు గుర్తుకొస్తాడు, మనిషికి అతీతమైన శక్తి ఏదో ఒకటి ఉందని భయం పోగొట్టుకోవడానికి దేవున్ని తలచుకోవడం సహజంగా జరిగిపోతోంది. నిజానికి మనిషి భ్రమల్లో బతుకుతున్నాడు. అలాకాక మనిషి తనకు ఇతరంగా ఏమీలేదని ప్రతి చర్యకు తానే కారణమని నమ్మిననాడు ఆ భ్రమల నుంచి బయటపడి ముందుకు సాగగలడు. భయంలో పుట్టి భ్రమల్లో సాగుతున్న దేవుడు వాస్తవ జగత్తులో సమాజానికి అవసరం లేదు. మంచి చెడుకు మనిషే కారణమని మానవుడు ముందుకు సాగడం అవశ్యంగా భావించాలి. అందుకే దేవుడు అందరివాడా, కొందరివాడా అనే మీమాంసకు స్వస్తి పలికి ఉన్నాడని అన్నా లేడని అనేది మనిషే కనుక సమాజానికి కేంద్ర బిందువు మనిషేనని గుర్తించాలి..

సెల్: 9885569394

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించిన సీఆర్

డాక్టరు కిలారు పూర్ణచంద్రరావు

1914 జూన్ 6 వ తేదీన కృష్ణాజిల్లా మంగళాపురం గ్రామంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావుకి జూన్ ఆరవ తేదీ 112 వ జన్మదినోత్సవం. ఆయన శత జయంతి సందర్భంగా నేను రాసిన 'కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వర రావు జీవన గమనం' అనే పుస్తకం ప్రచురితమైంది. నాకు ఎనిమిది సంవత్సరాల వయసున్నప్పటి నుంచీ ఆయనతో అనుబంధం ఉంది. కొన్ని నెలల పాటు ఆయన మంగళాపురం గ్రామంలో ఉన్నప్పుడు దాదాపు రోజూ ఆయనతో ఓ గంటసేపైనా గడిపే వాడిని. కొంత బంధుత్వం ఉన్నా ఆ కారణంగా కాదు. అప్పటికే ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుల్లో ఒకరు. చల్లపల్లి జమీందారు అకృత్యాలకు వ్యతిరేకంగా, కౌలు చేస్తున్న పేద ప్రజలకు భూమి హక్కులు కల్పించటం కోసం సమరశీల పోరాటాలు నడిపారు. లాఠీ దెబ్బలు తిన్నారు. జైలు పాలయ్యారు. కోర్టుల చుట్టూ నెలల పాటు తిరిగారు. గ్రామంలో పెద్ద రైతు కుటుంబాల్లో ఒక్కటైన వారి ఇంట్లో పుట్టి, పేద ప్రజల పక్షాన నాయకత్వం వహించిన ఆయన పట్ల గ్రామ ప్రజలకందరికీ ఆరాధనా భావం ఉండేది. ఎంత పెద్ద నాయకుడైనా తన ఇంటి ముందు ఊడ్చేవాడు. కళ్లాపు చల్లేవాడు. సావిత్రమ్మకి ఇంటి పనుల్లో సాయపడేవాడు. నిలువెత్తు భారీ విగ్రహం కలిగి పనులన్నీ చేస్తుంటే నేను విస్మయంతో గమనించేవాడిని. నాకు తెలిసీ తెలియని వయసులో పాలేళ్లు, నౌకర్లు రైతుల కోసం ఎంత కష్టపడుతున్నారో చెప్పి, వాళ్లను గౌరవించాలని, చులకనగా మాట్లాడకూడదని చెప్పేవాడు. రాజకీయాల గురించి తెలియని వయసులో ఆయన వ్యక్తిత్వం నన్నెంతో ఆకర్షించింది. ఆయన పట్ల కలిగిన గౌరవం 1994 ఏప్రిల్ 9 వ తేదీన ఆయన మరణించి, ఆ మర్నాడు అంత్యక్రియల్లో పాల్గొనే వరకు పదిలంగా ఉంది. నేను దిల్లీలో పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు, ఆ తర్వాత ఎప్పుడు దిల్లీ వెళ్లినా అజయ్ భవన్‌కు వెళ్లి, ఒక పావుగంటైనా సీఆర్‌ను కలిసి మాట్లాడటం ఎంతో తృప్తిని కలిగించేది.

వామపక్ష ఉద్యమంలో చీలికలు:

స్వతంత్ర భారత దేశంలో జరిగిన తొలి ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో 5.2 శాతం ఓట్లు, అసెంబ్లీ ఎన్నికల్లో 6.2 శాతం ఓట్లతో ఒక ముఖ్యమైన ప్రతిపక్ష శక్తిగా అవతరించింది. నిషేధం తొలగిన వెంటనే జరిగిన ఎన్నికల్లో నాయకత్వం ఇంకా ప్రజల్లోకి పూర్తిగా రాకున్నా కమ్యూనిస్టు పార్టీతో కూడిన వామపక్ష ఫ్రంట్ 49 స్థానాలను పార్లమెంట్‌లో సాధించింది. 1957లో జరిగిన రెండవ సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ 10.9 శాతం ఓట్లను సాధించింది. కేరళలో విజయం సాధించి ప్రపంచంలోనే ఎన్నికల ద్వారా ఏర్పడిన తొలి మంత్రివర్గంగా నంబూద్రిపాద్ ప్రభుత్వం ఖ్యాతి గడించింది. 1962లో జరిగిన ఎన్నికల్లో కూడా 10.08 శాతం ఓట్లు, 32 పార్లమెంటు స్థానాలతో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. రష్యా, చైనా పార్టీల మధ్య ఏర్పడ్డ విభేదాలు భారత్‌పై ప్రభావం చూపాయి. భారత కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడింది. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గా చీలిపోయింది. భారత కమ్యూనిస్టు పార్టీకి ఎస్ఏ.డాంగే అధ్యక్షుడిగా, చంద్ర రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1967, 1971 ఎన్నికల్లో కూడా భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటులో 24 స్థానాలను గెలుచుకుంది. దానికి సమాన స్థాయిలో మార్క్సిస్టు పార్టీ కూడా స్థానాలను సంపాదించింది. అయితే కమ్యూనిస్టు పార్టీకి 69.36 లక్షల ఓట్లు రాగా, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీకి 75.11 లక్షల ఓట్లు వచ్చాయి. రెండింటికీ కలిపి దాదాపు పదిశాతం ఓట్లు దక్కాయి. బంగ్లా ప్రజలపై పాకిస్థాన్ మిలిటరీ అకృత్యాలకు పాల్పడుతున్నప్పుడు రాజేశ్వరరావు రష్యాలో పర్యటిస్తున్నారు.

భూ పోరాటంలో చంద్ర రాజేశ్వరరావు గారితో కలిసి దాసరి

బంగ్లా జాతీయ పోరాటానికి భారతదేశం సాయం చేస్తున్నది. అమెరికాతో పాటు పశ్చిమ దేశాలు పాకిస్థాన్‌కి మద్దతు నిస్తున్నాయి. ఆయన రష్యా అగ్ర నాయకత్వంతో మాట్లాడి, భారత్‌కు రష్యా భరోసా ఇవ్వటానికి కృషి చేశారు. అమెరికా బెదిరింపులకు తట్టుకొని నిలబడటానికి రష్యా భారతదేశానికి మద్దతు నిచ్చింది. కమ్యూనిస్టు పార్టీల ఐక్యత కోసం రాజేశ్వరరావు ఎంతగానో కృషి చేశారు. కాని ఆ ప్రయత్నం సఫలీకృతం కాలేదు.

1990లో ఆయన వయోభారం వల్ల పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వైదొలిగారు. 1990లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడం, ఎల్ట్సిన్ పెట్టుబడిదారీ విధానాలను అనుసరించడం రాజేశ్వరరావుని కుంగదీసింది. మక్దుం భవన్‌లో ఆయన్నొకసారి కలిసినప్పుడు 'సోవియట్ యూనియన్‌లో జరుగుతున్న పరిణామాలను, ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తిని అర్థం చేసుకోలేక పోయినందుకు విచారాన్ని వ్యక్తం చేశారు. ఆయన కోరిక మీద రెండు కాలనీల్లో సమావేశాలు ఏర్పాటు చేశాను. ఆ సమావేశాల్లో ఆయన రాజకీయాల గురించి కాకుండా, సామాజిక అంశాలైన కులం, మతం, ప్రాంతం వంటి దురభిమానాల పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ప్రజలు వాటి విపరీత పోకడలను ఎదుర్కోవాలని చెప్పారు. ఆ తర్వాత ఆయన జబ్బు పడి, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ 1994 ఏప్రిల్ 9 న మరణించారు. నిరాడంబరంగా జీవిస్తూ, సుదీర్ఘ కాలం పాటు భారత కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహించి, ఎంతో ధైర్యంగా పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. ఆయన రాసిన వీలునామా అందరినీ ఆశ్చర్య పరచింది. ఆయన పాటించిన విలువలకు అద్దం పట్టింది. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం నిరంతరం కృషి చేసిన ఆయన జీవితం ధన్యం. అందరికీ ఆదర్శప్రాయం.

(నేడు జయంతి సందర్భంగా)

సి.ఆర్., ఇంద్రజిత్ గుప్తాలతో దాసరి, 15వ జాతీయ మహాసభల్లో - హైదరాబాద్

తెలంగాణ రైతు పోరాటంలో ప్రముఖ పాత్ర

మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాలను అధ్యయనం చేయటం, వాటిని దేశ కాలమాన పరిస్థితులకు అన్వయించడం, పార్టీని నిర్మించడం, ఎట్టి గడ్డు పరిస్థితులనైనా ఎదిరించి నిలబడటం వంటి కార్యక్రమాలను ఆయన సుశిక్షితుడైన సైనికుడిగా, నాయకుడిగా నిర్వర్తించేవాడు. తెలంగాణ సాయుధ పోరాటం, తెభాగా ఉద్యమం, పున్నప్రవాయలార్ తిరుగుబాట్ల ద్వారా సాయుధ పోరాటం దేశ స్వాతంత్ర్యానికీ, సమ సమాజ ఏర్పాటుకి దారి తీస్తుందని నమ్మాడు. కాని స్వాతంత్ర్యానంతరం ఏర్పడ్డ ప్రభుత్వం పట్ల ప్రజలకున్న నమ్మకం, సుశిక్షితమైన భారత మిలిటరీని ఎదుర్కోవటం వల్ల తెలంగాణలో పార్టీ కేడరుకి కలిగిన నష్టాలు చూసిన తర్వాత పంథాను మార్చుకున్నాడు. నెలల పాటు అడవుల్లో తిరిగి, గెరిల్లా దళాలను పోరాట విరమణకు, ఆయుధాల అప్పగింతకు ఒప్పించాడు. జాతీయ ప్రజాస్వామ్య ఐక్య సంఘటనను ఏర్పాటు చేయడం, శాంతియుత పోరాటాల ద్వారా సోషలిస్టు శక్తులు పెట్టుబడిదారీ శక్తులపై విజయం సాధించగలవనే నమ్మి, శక్తి వంచన లేకుండా కృషి చేశాడు. భూ పోరాటాలు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణకు చేస్తున్న ఉద్యమాలను దేశ వ్యాపితంగా ముందుండి నడిపించాడు. మహిళా, యువజన ఉద్యమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవాడు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర వహించి, ఆర్డర్ ఆఫ్ లెనిన్, ఆర్డర్ ఆఫ్ డిమిట్రావ్ వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులను పొందారు. 25 సంవత్సరాల పాటు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పార్టీని, ఉద్యమాలను నడిపారు.ఆయన బెనారస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నప్పుడే గోల్వాల్కర్‌తో సైద్ధాంతికంగా తలపడ్డాడు. మతతత్వవాదులను భౌతికంగా కూడా ఎదిరించాడు. మచిలీపట్నం, విజయవాడల్లో రౌడీయిజాన్ని అణచివేశాడు. మత సామరస్యం కోసం పోరాడి, సెక్యులర్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి కృషి చేశాడు. మత కల్లోలాలు జరిగినప్పుడు బాధితులకు పార్టీ కార్యకర్తలు సాయపడేటట్లుగా దిశా నిర్దేశం చేసేవాడు. సోషలిజం, సెక్యులరిజంలతో పాటు భారత రాజ్యాంగంలో ప్రజాస్వామ్యానికి కూడా స్థిరమైన స్థానం ఉంది. కమ్యూనిస్టు ప్రణాళికలో 'శ్రామిక వర్గ నియంతృత్వం' అనే అంతిమ లక్ష్యం ఉంటుంది. సమాజంలో అనాదిగా భావవాదం, భౌతికవాదాల మధ్య సంఘర్షణ ఉంది. సైన్సుకి భౌతికవాదం పునాది. కార్యకారణ సంబంధం సైన్సుకి ప్రాతిపదిక. భారత రాజ్యాంగంలో సోషలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, శాస్త్రీయ దృక్పథం కీలకాంశాలుగా ఉన్నాయి. ఈ విలువలన్నిటినీ కమ్యూనిస్టు పార్టీ, రాజేశ్వరరావు అనునిత్యం కాపాడేవారు.

అమెరికా ఉచ్చులో ఉక్రెయిన్

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఉక్రెయిన్ కు నాటో లో భాగస్వామ్యం ఉంది. దానికి నాటో సభ్యత్వ అర్హత, అవసరం లేవు. అమెరికా చైనా-రష్యా చెలిమికి కినుక వహించింది. చైనా ను ఏమీ చేయలేక రష్యాను కట్టడి చేయడానికి అమెరికా ఉక్రెయిన్ కు నాటో ఆశను పెంచింది. రష్యాతో యుద్ధానికి దింపింది. 4125 రోజులుగా యుద్ధం జరుగుతోంది. అన్నీ దేశాల ఖనిజ సంపదలను దోచుకున్నట్లే ఉక్రెయిన్ ఖనిజ సంపద దోపిడీకి అమెరికా పన్నాగం పొన్నిమది. నెలల తరబడి అమెరికా ఉద్రిక్త చర్చల తర్వాత, ఏప్రిల్ 30, 2025న అమెరికా-ఉక్రెయిన్ ఖనిజ ఒప్పందం కుదిరింది. ఇది ఉక్రెయిన్ పునర్నిర్మాణ ఉమ్మడి నిధిని ఏర్పాటుచేస్తుంది. ఉక్రెయిన్ లోని కీలక ఖనిజాలు, సహజ వనరులైన లిథియం, టైటానియం, చమురు, వాయువుపై అమెరికాకు ప్రాధాన్యత ప్రాప్తిస్తుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆర్థికలబ్ధికి ఒత్తిడితో చేసిన ఈ ఒప్పంద లక్ష్యాలు: రష్యా నుంచి ఉక్రెయిన్ రక్షణకు దీర్ఘకాలిక అమెరికా మద్దతు. సాంకేతికత, పునరుత్పాదక శక్తి, సైనికావసరాలకు, అరుదైన ఖనిజాల కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడం. ఉక్రెయిన్ పునర్నిర్మాణ నిధిని అమెరికా-ఉక్రెయిన్ లు సమాన భాగస్వామ్యంతో నిర్వహిస్తాయి. ఖనిజ, చమురు, వాయువు కొత్త ప్రాజెక్టుల ఖర్చును ఉక్రెయిన్ 50% భరిస్తుంది. రక్షణ వ్యవస్థ ప్రత్యక్ష నిధులను, సైనిక సహాయాన్ని అమెరికా అందిస్తుంది. మొదటి పదేళ్ళు లాభాలను ఉక్రెయిన్ ఆర్థికవ్యవస్థలో పెట్టుబడి పెడతారు. పంపిణి నిబంధనలను తర్వాత చర్చిస్తారు. ఉక్రెయిన్ కు వనరుల యాజమాన్య నియంత్రణలుంటాయి. భూగర్భనిధులు, హైడ్రోకార్బన్లతో సహా 55 ఖనిజాలు ఒప్పందంలోకి వస్తాయి. నాఫ్టోగాజ్, ఉక్రనాఫ్టా వంటి ప్రస్తుత ప్రాజెక్టులను మినహాయించారు. పాత ఒప్పందాల వలె కాక ఇందులో అమెరికా సహాయాన్ని ఉక్రెయిన్ చెల్లించనవసరంలేదు. (సహాయం 12,000 కోట్ల డాలర్లని అంచనా. కాని ట్రంప్ 35,000 కోట్ల డాలర్లకు దావా వేశారు.).

ఇది "జూనియర్ భాగస్వామి"గా ఉక్రెయిన్ అవసరాలను తీరుస్తూ సహకారంపై దృష్టిపెడుతుంది. కొత్త ప్రాజెక్టుల తిరస్కరణ హక్కును అమెరికా పొందుతుంది కాని ప్రత్యేక హక్కుల్లేవు. (అమెరికాకు ఇంకా ఏ హక్కు కావాలి?)

ఖనిజాల ఒప్పందం చేసుకున్న అమెరికా ఉక్రెయిన్ నాయకులు

ఉక్రెయిన్ ప్రపంచ పెట్టుబడిని ఆకర్షించచ్చు. (దీనితో అమెరికాకు ఖర్చు తగ్గుతుంది) ఈ ఒప్పందం ఉక్రెయిన్ ను అమెరికా అనుకూల యూరోపియన్ యూనియన్ (ఇయు)లో చేరుస్తుంది. అవసరమైతే (అమెరికా ఆమోదంతో) చర్చించవచ్చు. భద్రత ఖర్చు లేకుండా అమెరికా బంధాన్ని భద్రపర్చి ఉక్రెయిన్ చిక్కులను తగ్గించిన దౌత్య విజయంగా ఈ ఒప్పందం పరిగణించబడింది. ఇది ఉక్రెయిన్ కు నిరాశ. ఉక్రెయిన్ స్థిరత్వంలో అమెరికాకు వాటాతో రష్యా దురాక్రమణను అమెరికా పెట్టుబడి అడ్డుకుంటుందని ఉక్రెయిన్ ఆశ. పునర్నిర్మాణానికి ప్రపంచ మూలధన ఆకర్షణ కూడా దీని లక్ష్యం. దీనికి ఉక్రెయిన్ పార్లమెంట్ ఆమోదించాలి. ఈ ఒప్పందం ట్రంప్ లావాదేవీ దౌత్యానికి మద్దతిస్తుంది. భూసంపదలో చైనా ఆధిపత్యాన్ని (ప్రపంచ సరఫరాలో చైనా వాటా 90శాతం) ఎదుర్కొంటుంది. ఉక్రెయిన్ సార్వభౌమత్వం కంటే తన ఆర్థికలాభాన్ని అమెరికా చూసుకుందని విమర్శకుల వాదన. కొందరు దీన్ని వలస రాజీకరణగా భావించారు. "ఈ ఒప్పందం స్వేచ్ఛా, సార్వభౌమ, సంపన్న ఉక్రెయిన్ లో రష్యా వ్యతిరేక అమెరికా ఆక్రమణ. శాంతి చర్చల్లో రష్యాను బలహీనపర్చే అమెరికా విధానం" అని రష్యా ఆందోళన చెందుతోంది.

కొనసాగుతున్న సంఘర్షణ, 25శాతం ఉక్రెయిన్ భూమిని కలుషితంచేసిన ల్యాండ్‌మైన్లు పెట్టుబడులను నిరోధిస్తాయి. విద్యుత్ గ్రిడ్ల వంటి విచ్ఛిన్న మౌలిక సౌకర్యాలు మైనింగ్‌ను క్లిష్టతరం చేస్తాయి. కాలంచెల్లిన భౌగోళిక సమాచారం, యుద్ధ సంబంధ అంతరాయాలు, కొత్త శుద్ధి కర్మాగారాల అవసరం కారణంగా ఖనిజ వెలికితీతకు 10-20 ఏళ్ళు పట్టచ్చు. భూసంపదపై ఆదాయం అనిశ్చితమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వనరుల ఒప్పందాల చారిత్రక లోపాలను (1990ల రష్యా ఒప్పందాలు) ఉటంకిస్తూ ఎడ్ వెరోనా వంటి విశ్లేషకులు ఒప్పంద దీర్ఘాయువును ప్రశ్నిస్తున్నారు. కొందరు దీన్ని ఆర్థిక ప్రగతి ప్రక్రియగా కాక రాజకీయ చర్యగా చూశారు. ఫిబ్రవరి 2025లో ట్రంప్, ఉక్రేనియన్ అధ్యక్షుడు జెలెన్స్కీల మధ్య జరిగిన శ్వేతసౌధ సమావేశం అమెరికా సహాయాన్ని నిలిపివేసింది. ఇలాంటి అనేక వ్యతిరేక చర్యల తర్వాత జరిగిన ఒప్పందం ఇది. ఈ ఒప్పందం ఉక్రెనియన్ లో అమెరికా లాభాల కొనసాగింపే.

బలమైన దేశీయ మద్దతును ప్రతిబింబిస్తూ ఉక్రెయిన్ పార్లమెంట్ మే 8, 2025న ఈ ఒప్పందాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. కొందరు దీన్ని అమెరికా-ఉక్రెయిన్ సంబంధాల "భారీ విజయం"గా చూశారు. కొందరు ఉక్రెయిన్ కు భద్రతలేని భారీ దోపిడీగా విమర్శించారు. ఈ ఒప్పందం పరస్పర ప్రయోజనకారి అనుకున్నా, ట్రంప్ భద్రతా నిరాకరణను, ఆర్థిక దురాశను ప్రతిబింబిస్తుంది. ఉక్రెయిన్ దీర్ఘకాలిక స్వయంప్రతిపత్తి కంటే అమెరికా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తుంది. రుణ చెల్లింపు లేకపోడం ఉక్రెయిన్‌కు రాయితీ. యుద్ధ విచ్ఛిన్న ఉక్రెయిన్ భవిష్య పెట్టుబడులపై ఆధారపట్టం దాని ఆచరణాత్మకలోపం. ఉక్రెయిన్ అపార ఖనిజ నిల్వలు (ప్రపంచ కీలక ఖనిజాల్లో 5%, టైటానియంలో 7%) ఊహకందని ఆస్తి. కానీ అనిశ్చితంగా సాగుతున్న సంఘర్షణ మధ్య శాంతి, మౌలిక సదుపాయాల పునర్నిర్మాణాలపై వాటి దోపిడీ ఆధారపడి ఉంటుంది. రష్యా పై యుద్ధానికి దింపడం ఉక్రెయిన్ పై అమెరికా మొదటి ఉచ్చు. ఈ ఖనిజ ఒప్పందం ఉక్రెయిన్ పై అమెరికా రెండవ ఉచ్చు.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
చరవాణి: 9490 20 4545.

సామాన్యుడి ప్రాణాలకు విలువ లేదా: గోయెంకా

బెంగళూరు: బెంగళూరులో ఆర్‌సీబీ జట్టు విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంపై ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా సామాజిక మాధ్యమం వేదికగా గురువారం స్పందించారు. ఎక్స్ ఖాతాలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'దిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట... కుంభమేళాలో తొక్కిసలాట... ఇప్పుడు బెంగళూరులో తొక్కిసలాట... ఈ ఘటనల్లో డజన్ల కొద్దీ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కానీ, ఇంతవరకు ఎవరూ బాధ్యత తీసుకోలేదు. రాజీనామాలు చేయలేదు. పాఠాలు నేర్చుకోలేదు. మన దేశంలో సామాన్యుడి ప్రాణాలు అమూల్యమైనవి కావా? అంత విలువ లేదా? వారి ప్రాణం విలువ ఒక కప్ చాయ్ కంటే చౌకగా మారింది. ఇలాంటి ఘటనల తర్వాత అంతా యథావిధిగానే ఉంటోంది. ఏమీ మారట్లేదు' అంటూ గోయెంకా ఆవేదన వ్యక్తం చేశారు. తన పోస్ట్‌కు హృదయం ముక్కలైన ఎమోజీని ఆయన జతచేశారు.

తేజస్విని బీహార్‌కు రాజును చేయడానికి లాలూ ఆరాటం: ప్రశాంత్ కిశోర్

పాట్నా: రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌పై ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. 9వ తరగతి కూడా పాస్ కాని తన కుమారుడు తేజస్వీ యాదవ్‌ను బీహార్‌కు రాజును చేయాలని లాలూ ఆరాటపడుతున్నారని వ్యాఖ్యానించారు. బీహార్‌లోని సరన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ 'ప్రజలంతా తమ పిల్లలను ఎలా చూసుకోవాలో లాలూప్రసాద్ యాదవ్ నుంచి నేర్చుకోవాలి. ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ 9వ తరగతి కూడా పాస్ కాలేదు. లాలూ తన కుమారుడి భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. తేజస్విని బీహార్‌కు రాజును చేయాలని తెగ ఉబలాటపడుతున్నారు. మేము ఇలా మాట్లాడుతుంటే... ఆయన్ను విమర్శిస్తున్నామని ప్రజలు అంటున్నారు. కాదు, మేము ఆయన్ను ప్రశంసిస్తున్నాం. సామాన్య ప్రజల పిల్లలు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినా... వారికి ఉద్యోగాలు రావడం లేదు' అని కిశోర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో నిజమైన మార్పు చూడాలనుకునే ప్రజల ఆకాంక్ష రోజురోజుకు పెరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న అవినీతితో సామాన్యులు విసిగిపోయారని, మార్పును బలంగా కోరుకుంటున్నారన్నారు.

అసెంబ్లీని సమావేశపర్చాలి

రిజర్వేషన్ చట్టాలపై నితీశ్‌కు తేజస్వి లేఖ

పాట్నా: సమాజంలోని బలహీన వర్గాల కోసం 85 శాతం కోటా పెంపునకు కొత్త శాసనాలపై అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపర్చాలని ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఆయన గురువారం లేఖ రాశారు. ఈ లేఖను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. రిజర్వేషన్ల అంశంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తోందన్నారు. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ కింద తాజా చట్టాలను కేంద్రానికి పంపాలని తేజస్వీ యాదవ్ సూచన చేశారు. 2023లో ఆమోదం పొందిన శాసనాలను ప్రస్తావించారు. వాటిని పాట్నా హైకోర్టు పక్కకు పెట్టేసిందని గుర్తుచేశారు. 69 శాతం కోటా అమల్లో ఉన్న తమిళనాడును ఉదాహరణగా చూపారు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా న్యాయ జోక్యం లేకుండా రిజర్వేషన్ చట్టాలను బీహార్ కూడా కలిగివుండవచ్చన్నారు. కొత్త చట్టాల రూపకల్పనకు అఖిలపక్ష కమిటీ వేయాలని, వాటిని ఆమోదించేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆర్‌జేడీ నేత సూచించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించడం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతామని దుయ్యబట్టారు. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో తేజస్వీ యాదవ్ డిమాండ్లకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఎన్‌సీపీ వర్గాల విలీనం లేదు: సూలే

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)కి చెందిన రెండు ప్రత్యర్థి వర్గాల విలీనం కోసం ఎలాంటి ప్రతిపాదన లేదని, రానున్న రోజుల్లో దీనిపై చర్చించే అవకాశం లేదని ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే గురువారం స్పష్టంచేశారు. ఎన్‌సీపీ రెండు వర్గాల ఒక్కటవుతాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతుండంపై విలేకరుల ప్రశ్నకు ఆమె స్పందిస్తూ చర్చించేంత గొప్పగా ఇక్కడేమీ జరగడంలేదన్నారు. 'మీరు మమ్మల్ని ప్రతిపక్షం (ఇండియా)లో చూస్తారు. మరికొద్ది రోజుల్లో ఇండియా ఐక్య సంఘటన భేటీ కాబోతోంది. మేము అందులో భాగస్వాములుగా మీకు కనిపిస్తాం' అని ఆమె అన్నారు. ఈనెల 10న పూనేలో ఎన్‌సీపీ 26వ వ్యవస్థాపక దినోత్సవం జరగనుంది. కార్యక్రమంలో ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్‌సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ప్రసంగించనున్నారు. ఇటీవల పరిణామాల క్రమంలో అజిత్ పవార్, శరద్ పవార్ చాలా సందర్భాల్లో కలిశారు. 2023 జులైలో ఎన్‌సీపీ చీలిపోయిన విషయం విదితమే.

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌ఐఏ విస్తృత సోదాలు

శ్రీనగర్: ఉగ్రవాద కుట్ర దర్యాప్తునకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) గురువారం జమ్మూకశ్మీర్ అంతటా అనేక ప్రాంతాల్లో దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పుల్వామా, కుల్గాం, షోపియాన్, బారాముల్లా, కుప్వారా జిల్లాలు సహా 32 ప్రదేశాలలో సోదాలు జరిగాయని చెప్పారు. వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన ఓవర్ గ్రౌండ్ వర్కర్లపై ఈ సోదాలు జరుగుతున్నాయన్నారు. ఓవర్ గ్రౌండ్ వర్కర్లు అంటే లాజిస్టికల్ సపోర్ట్, నగదు, ఆశ్రయం, ఇతర మౌలిక సదుపాయాలతో ఉగ్రవాదులకు సహాయం చేసే వ్యక్తులుపై దృష్టి సారించిందని తెలుస్తోంది.

ఫ్రీ టికెట్లు... గేట్ల మూసివేత

తొక్కిసలాటకు ఇవే కారణాలు

బెంగళూరు: సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్ కప్పు సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయోత్సవం కొన్ని గంటలకే ఆవిరైంది. తమ ఆరాధ్య క్రికెటర్లను చూసేందుకు అభిమానులు పోటెత్తడంతో జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన వెనక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఉచిత పాస్‌లంటూ వదంతులు... స్టేడియం వద్ద గేట్ల మూసివేతతో నెలకొన్న గందరగోళం... అధిక రద్దీతో తోపులాటతో ఈ విషాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 35 వేల మంది మాత్రమే. కానీ, బుధవారం సాయంత్రం అక్కడికి దాదాపు మూడు లక్షల మంది అభిమానులు చేరుకున్నారు. ఈ స్టేడియంలో మొత్తం 21 స్టాండ్‌లు, 13 గేట్లు ఉన్నాయి. ఇందులో 9, 10వ నంబరు గేట్లను రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు రిజర్వ్ చేశారు. 5, 6, 7 గేట్ల నుంచి అభిమానులకు ప్రవేశం కల్పించారు. ఇందులో 7వ నంబర్ గేట్ నుంచి చూస్తే చిన్నస్వామి స్టేడియం ప్రధాన ప్రవేశం నుంచి లోపలికి వచ్చే వ్యూ కనిపిస్తుంది. మెయిన్ ఎంట్రెన్స్ నుంచే ఆర్సీబీ జట్టు మైదానంలోకి ప్రవేశిస్తుంది. అందువల్ల ఏడో నంబరు గేట్ వద్దకు అభిమానులు పోటెత్తారు. పాస్‌లు ఉన్నవారు మాత్రమే స్టేడియం లోపలికి వెళ్లేందుకు అనుమతి ఉంది. కానీ, చాలా మంది పాస్‌లు లేకుండానే అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో ఏడో నంబరు గేట్ వద్ద ఉచిత టికెట్లు పంచుతున్నారన్న ప్రచారం మొదలైంది. వాటిని తీసుకునేందుకు అభిమానులు పరుగులు తీశారు. టికెట్ల కోసం ఒకరినొకరు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ గేట్ వద్దే అత్యధిక నష్టం సంభవించింది. స్టేడియం వద్ద రద్దీని నియంత్రించేందుకు 5 వేల మంది పోలీసులను మోహరించారు. కానీ, అంచనాలకు మించి అభిమానులు రావడంతో వారిని నియంత్రించడం కష్టతరమైంది. గేట్లు కూడా చిన్నవిగా ఉండటంతో వారు లోపలికి వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. 'స్టేడియం గేట్లు చిన్నగా ఉన్నాయి. అభిమానులు కిక్కిరిసిపోవడంతో కొన్నిచోట్ల గేట్లు విరిగిపోయాయి. రద్దీ ఎక్కువగా ఉండటం వల్లే ఈ ఘటన సంభవించిందని అనుకుంటున్నాం' అని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. పాస్‌లు ఉన్నప్పటికీ తమను లోపలికి రానియ్యకుండా గేట్లు మూసివేశారంటూ కొంతమంది అభిమానులు ఆరోపించారు. మరోవైపు, బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు పరేడ్ ఉంటుందని ఆర్సీబీ జట్టు ముందే ప్రకటించింది. అయితే, అభిమానుల రాకను ముందే అంచనా వేసిన పోలీసులు ర్యాలీకి అనుమతినివ్వలేదు. ఆర్సీబీ జట్టు పరేడ్ ఉండదని, కేవలం స్టేడియంలో సన్మాన కార్యక్రమానికి మాత్రమే అనుమతి ఉందని బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు ఉదయం 11.56 గంటలకు ప్రకటించారు. కానీ, మధ్యాహ్నం ఆర్సీబీ మేనేజ్‌మెంట్ మరో ప్రకటన చేసింది. పరేడ్ నిర్వహిస్తామని, అభిమానులు మార్గదర్శకాలు పాటించాలని కోరింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో గందరగోళం నెలకొంది. పరేడ్ ఉంటుందో లేదో తెలియక ఎక్కువమంది నేరుగా మైదానం లోపలికి వెళ్లేందుకే ఉత్సాహం చూపించారు. కొంతమంది టికెట్లు లేకుండానే గేట్లు దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకుని పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

ప్రతి భారతీయుడిపై ఆర్థిక ఒత్తిడి

రాహుల్ గాంధీ

న్యూదిల్లీ: ప్రతి భారతీయుడు ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటున్నాడని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం అన్నారు. ప్రభుత్వం కొంతమంది పెట్టుబడిదారుల కోసం పని చేస్తోందని విమర్శించారు. 'గణాంకాలు నిజం చెబుతున్నాయి' అని కాంగ్రెస్ నేత తన 'ఎక్స్' ఖాతాలో హిందీలో రాశారు. 'గతేడాది ద్విచక్ర వాహనాల అమ్మకాలు 17 శాతం, కార్ల అమ్మకాలు 8.6 శాతం తగ్గాయి. మొబైల్ మార్కెట్ 7 శాతం తగ్గింది. మరోవైపు ఖర్చులు, అప్పులు నిరంతరం పెరుగుతున్నాయి. ఇంటి అద్దె, దేశీయ ద్రవ్యోల్బణం, విద్యా ఖర్చులు, దాదాపు ప్రతిదీ ఖరీదైనవిగా మారుతున్నాయి. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు. ప్రతి సాధారణ భారతీయుడు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడికి చెందిన వాస్తవికత ఇది' అని పేర్కొన్నారు. గత నెల సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ తయారీదారులు (ఎస్‌ఐఏఎం) ద్విచక్ర వాహనాల పంపిణీ ఏప్రిల్‌లో 17 శాతం తగ్గి 14,58,784 యూనిట్లకు చేరుకున్నాయని తెలిపింది. అదే కాలంలో దేశంలోని ఫ్యాక్టరీల నుంచి కంపెనీ డీలర్‌షిప్‌లకు ప్రయాణికుల వాహనాల పంపిణీ సంవత్సరానికి 4 శాతం పెరిగి 3,48,847 యూనిట్లకు చేరుకున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో స్కూటర్ అమ్మకాలు 5,48,370 యూనిట్లుగా ఉన్నాయి. ఇది 2024 ఏప్రిల్‌లో 5,81,277 యూనిట్ల నుంచి 6 శాతం తగ్గింది. మోటార్‌సైకిల్ పంపిణీలు 23 శాతం తగ్గాయి. ఏప్రిల్‌లో గత సంవత్సరంతో పోలిస్తే 8,71,666 యూనిట్లు. గత నెలలో మోపెడ్ హోల్‌సేల్స్ 38,748 యూనిట్లకు చేరుకున్నాయి. ఇది 8 శాతం తగ్గి 41,924 యూనిట్లు. అదే విధంగా 2025 మొదటి త్రైమాసికానికి సంబంధించిన సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) ఇండియా మొబైల్ హ్యాండ్‌సెట్ మార్కెట్ సమీక్ష నివేదిక ప్రకారం భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ రవాణా 7 శాతం తగ్గింది. 'సంఘటనల మెరుపు గురించి కాదు... రోజువారీ జీవిత వాస్తవికత గురించి ప్రశ్నలు అడిగే పరిస్థితిని అర్థం చేసుకునే, బాధ్యతాయుతంగా స్పందించే రాజకీయాలు మనకు అవసరం' అని రాహుల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఎంపిక చేసిన కొంతమంది పెట్టుబడిదారుల కోసం కాకుండా ప్రతి భారతీయుడి కోసం పనిచేసే ఆర్థిక వ్యవస్థ మనకు అవసరం' అని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ జపాన్‌ను అధిగమించిందని ప్రభుత్వం పేర్కొన్న సమయంలో ఆయన వ్యాఖ్యలు వచ్చాయి.

ఉగ్ర పాక్‌కు ఆ బాధ్యతలా?

భారత్‌కు మద్దతు ఇవ్వండి: ఖర్గే

న్యూదిల్లీ: పాక్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఓ సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఇటీవల కాలంలో పాక్‌కు బెయిల్‌ఔట్ ప్యాకేజీలు, రుణాలు లభించిన సొమ్ము సైన్యం, భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై వెచ్చిస్తుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఉగ్రవాదాన్ని పోషించే పాక్‌ను... ఉగ్ర బాధిత దేశమైన భారత్‌తో పోల్చడం సరికాదన్నారు. పాకిస్థాన్‌ను ఐరాస భద్రతా మండలి కౌంటర్ టెర్రరిజం కమిటీ వైస్ చైర్మన్‌గా చేయడం, తాలిబన్ శాంక్షన్ కమిటీకి 2025కు గాను అధ్యక్షత అప్పగించడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఇది పూర్తిగా దురదృష్టం, అవగాహన రాహిత్యం, ఏమాత్రం ఆమోదయోగ్యం కానిదన్నారు. ఉగ్ర ఫైనాన్స్‌పై నిఘా కోసం పాకిస్థాన్‌ను ఆర్థిక కార్యదళం గ్రేలిస్ట్‌లో తిరిగి చేర్చాలన్న భారత్ డిమాండ్‌లోని సహేతుకతను గమనించాలన్నారు.

ఇది కేవలం భారత్ కోసం కాదని, అంతర్జాతీయ సమాజం ప్రయోజనాల కోసం అవసరమన్నారు. మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ పాకిస్థాన్‌లోనే హతమయ్యాడన్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేడా కూడా కౌంటర్ టెర్రరిజం కమిటీకి పాకిస్థాన్ నాయకత్వం వహించడాన్ని వ్యతిరేకించారు. 'జూన్ 4వ తేదీన తాలిబన్ ఆంక్షల కమిటీకి పాకిస్థాన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైంది. ఇది మన విదేశాంగ విధానం విషాదగాథ. ప్రపంచ దేశాలైనా ఎలా అనుమతించాయి' అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

మాది పేదల ప్రభుత్వం

ఆత్మనిర్భర్‌కు కట్టుబడి ఉన్నాం: మోదీ

న్యూదిల్లీ: పేదల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయం సమృద్ధి సాధించేందుకు అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. 'పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాయి. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయటపడ్డారు' అని పేర్కొన్నారు. మోదీ సర్కార్ 3.0 ఏర్పడి జూన్ 9 నాటికి ఏడాది పూర్తికానుంది. దీంతో ఆయన 11 ఏళ్లపాటు నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగినట్లవుతుంది.

'సిందూర' మొక్క నాటిన ప్రధాని

ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలోని తన అధికార నివాస ప్రాంగణంలో 'సిందూర' మొక్క నాటారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం 1971లో పాకిస్థాన్‌తో భారత్ చేసిన యుద్ధంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన మహిళా బృందం ఇచ్చిన ఈ మొక్కను పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన నాటారు. అందుకు సంబంధించిన ఫొటోలను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. 'బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్థాన్‌తో భారత్ చేసిన యుద్ధంలో కచ్‌కు చెందిన తల్లులు, సోదరీమణులు వీర పరాక్రమాలు ప్రదర్శించారు. ఇటీవల నేను గుజరాత్‌లో పర్యటన చేసిన సమయంలో ఆ మహిళా బృందం నన్ను కలిసింది. అప్పుడే వారు నాకు ఈ మొక్క అందించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ మొక్క నాటాను. ప్రధానమంత్రి నివాసంలో ఈ మొక్క నాటే గొప్ప అవకాశం నాకు దక్కినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ మొక్క మన దేశ మహిళా శక్తి, శౌర్యం, స్ఫూర్తికి బలమైన చిహ్నంగా నిలుస్తుంది' అని ప్రధాని మోదీ పోస్టు చేశారు. అందుకు సంబంధించిన ఫొటోలను జత చేశారు.

ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు ప్రారంభం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మోదీ దిల్లీలో భగవాన్ మహవీర్ వనస్థలి పార్కులో మొక్క నాటారు. దిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించి ఉన్న 700 కి.మీ ఆరావళి పర్వత శ్రేణిలో అడవులను తిరిగి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని మోదీ పేర్కొన్నారు. మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ఓ కార్యక్రమాన్ని రూపొందించింది. దీనికి 'ఏక్ పెడ్ మా కే నామ్' (ఒక చెట్టుకు నా పేరు) పేరుతో ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగానే ప్రచారాన్ని విస్తరించినట్లు ప్రధాని తెలిపారు. 'అత్యంత పురాతన పర్వత శ్రేణుల్లో ఆరావళి పర్వత శ్రేణి ఒకటి. ఇది గుజరాత్, రాజస్థాన్, హర్యానా, దిల్లీలను కవర్ చేస్తుంది. కొన్ని సంవత్సరాలుగా ఈ పర్వత శ్రేణి అనేక పర్యావరణ సవాళ్లను ముందుకు తెచ్చింది. ఈ సవాళ్లను తగ్గించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ పర్వత శ్రేణిని కాపాడుకునేందుకు తమ ప్రభుత్వం దృష్టిసారించినట్లు ప్రధాని తెలిపారు. ఈ శ్రేణితో అనుసంధానమైన ప్రాంతాలను పునరుజ్జీవింపజేయడంపై మేము దృష్టి పెట్టాం. దీనికి స్థానిక పరిపాలనతో కలసి పని చేయబోతున్నాం. ఇలా జరగాలంటే నీరు సమృద్ధిగా ఉండాలి. అందుకు తగినవిధంగా నీటి వ్యవస్థలను మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నాం. పర్యావరణ మార్పుల్లో భాగంగా తలెత్తే వాయు తుపానులను అరికట్టడం, ఈ శ్రేణి థార్ ఎడారి తూర్పువైపు విస్తరణను ఆపడం వంటి చర్యలు చేపట్టినట్లు మోదీ పేర్కొన్నారు.

హెలికాప్టర్లలో 59 మంది పర్యాటకుల తరలింపు

గ్యాంగ్‌టక్: భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉత్తర సిక్కిం నుంచి 59 మంది పర్యాటకులను గ్యాంగ్‌టక్‌కు తీసుకువచ్చారు, వాతావరణం మెరుగుపడిన తర్వాత సహాయక చర్యలు తిరిగి ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఉత్తర సిక్కింలోని లాచుంగ్‌లో దాదాపు వారం రోజులుగా చిక్కుకున్న 109 మంది పర్యాటకులలో వీరు ఉన్నారు. వాతావరణం మెరుగుపడిన తర్వాత తెల్లవారుజామున రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్ సమీపంలోని పాక్యాంగ్ విమానాశ్రయం నుంచి ఉత్తర సిక్కింలోని చాటెన్‌కు రెండు ఎం-17వీ5 హెలికాప్టర్లు బయలుదేరాయి. 39 మంది పర్యాటకులు ఒక హెలికాప్టర్‌లో తిరిగి రాగా, 20 మంది మరొక హెలికాప్టర్‌లో వచ్చారని అధికారులు వివరించారు. వారిలో ఇద్దరు విదేశీయులు ఉన్నారని తెలిపారు. ఈ పర్యాటకులు పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురికి చేరుకోవడానికి సహాయం చేయడానికి సిక్కిం జాతీయ రవాణా (ఎస్ఎన్‌టీ) బస్సులు ఏర్పాటు చేసింది. సిలిగురికి సమీపంలోని బాగ్డోగ్రాకు విమానంలో ప్రయాణించాలనుకునే వారి కోసం పాక్యాంగ్ విమానాశ్రయంలో అదనపు హెలికాప్టర్‌ను సిద్ధంగా ఉంచారు. రెండు హెలికాప్టర్లు ఎన్‌డీఆర్‌ఎఫ్, విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు అవసరమైన సేవలను పునరుద్ధరించడానికి ఈ ప్రాంతంలో పనిచేసే ఎయిర్‌టెల్ ఇంజనీర్లతో చాటెన్‌కు వెళ్లాయని వారు తెలిపారు. ఈ 109 మంది పర్యాటకులను వాయు మార్గంలో చాటెన్‌కు తీసుకువచ్చారని అన్నారు. పర్యాటకులను హోటళ్లలో, చాటెన్ సైనిక శిబిరంలో ఉంచినట్లు ఒక అధికారి తెలిపారు. ఉత్తర సిక్కింలో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం పాక్యోంగ్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ సేవలు నిలిపివేశారు. దీంతో తరలింపు ఆలస్యమయింది. ఆదివారం చాటెన్‌లోని సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు సైనిక సిబ్బంది మరణించగా, ఆరుగురు సైనికులు గల్లంతయ్యారు. మరికొందరు కూడా గాయపడ్డారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా గల్లంతయిన ఆరుగురు సిబ్బంది కోసం గాలింపు చర్యలకు ఆటంకం నెలకొందని అధికారి ఒకరు చెప్పారు. మున్షితాంగ్, చాటెన్ మధ్య ఉన్న తరణ్ చు నదిపై ఉన్న రెండు కీలక వంతెనలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొట్టుకుపోవడంతో లాచెన్ నుంచి చాటెన్‌కు వాహనాల రాకపోకలు తెగిపోవడంతో ఉత్తర సిక్కింలో కొనసాగుతున్న సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మూడు రోజుల క్రితం లాచుంగ్, చుంగ్‌తాంగ్ నుంచి 1,678 మంది పర్యాటకులను రక్షించగా, ఇద్దరు అమెరికన్ జాతీయులు సహా 33 మందిని బుధవారం విమానాల ద్వారా విజయవంతంగా తరలించారు.

బీజేపీ నాయకురాలి దాష్టీకం

- మైనర్ కుమార్తెపై ప్రియుడితో అత్యాచారం చేయించిన వైనం
- ఇద్దరి అరెస్టు: మరో నిందితుడి కోసం గాలింపు

హరిద్వార్: సభ్యసమాజం తలదించుకునే ఘటన ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగింది. బీజేపీ పాలిత రాష్ట్రంలో ఆ పార్టీ నాయకురాలు దాష్టీకానికి ఒడిగట్టారు. తన సొంత కుమార్తె విషయంలో క్రూరంగా ప్రవర్తించారు. మూడు పదుల వయస్సు దాటిన తన ప్రియుడు, అతని సహచరుడితో తన 13ఏళ్ల కుమార్తెపై సామూహిక అత్యాచారం చేయించారు. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. బాలిక తండ్రికి విషయం చెప్పడంతో ఆ తల్లి క్రూరత్వం బయపడింది. బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించడంతో తల్లిని, ఆమె ప్రియుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు హరిద్వార్ ఎస్ఎస్‌పీ పర్మేంద్ర దోబల్ గురువారం వెల్లడించారు. బీఎన్‌ఎస్‌లోని సెక్షన్లు 70 (2) (సామూహిక అత్యాచారం), 351 (3) (నేరపూరిత బెదిరింపులు), 3(5) (ఉద్దేశపూర్వకంగా సామూహికంగా చేసిన నేరం)తో పాటు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందిత తల్లిని అనామికా శర్మ, ఆమె ప్రియుడు సుమిత్ పట్వాల్‌గా గుర్తించినట్లు చెప్పారు. వీరిద్దరిని బుధవారం ఓ హోటల్ నుంచి అరెస్టు చేశామన్నారు. వైద్య పరీక్షల జరుపగా బాలికపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారణ అయిందని ఎస్ఎస్‌పీ వెల్లడించారు. సుమిత్ సహచరుడు శుభమ్ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. హరిద్వారా, ఆగ్రా, బృందావనంలో జనవరి నుంచి మార్చి వరకు ఆ ఇద్దరితో పాపపై లైంగిక దాడి తల్లి సమక్షంలో, ఆమె అనుమతితో జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. బయటకు చెబితే తండ్రిని చెంపేస్తామని వారు బాలికను బెదిరించారన్నారు. అనామిక తన భర్తను వదిలేసి ప్రియుడితో కలిసి ఓ హోటల్‌లో ఉంటున్నట్లు చెప్పారు. బీజేపీ మహిళా మోర్చా హరిద్వారా జిల్లా శాఖ మాజీ అధ్యక్షురాలిగా అనామిక పనిచేశారు. తాజా కేసుతో క్రమంలో ఆమె పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని కోల్పోయారు. అనామిక 2024 నుంచే పార్టీలో ఏ పదవుల్లో లేరని బీజేపీ పేర్కొంది.

'మేడమ్ ఎన్' ట్రాప్‌లో భారత ఇన్‌ఫ్లూయెన్సర్లు

న్యూదిల్లీ: పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ కింద పనిచేసే ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి పదవీ విరమణ చేశారు. షెహజాదకు ఐఎస్ఐతో బలమైన సంబంధాలున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'. హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్‌తో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతో ఉన్న బలమైన సంబంధాలు వెల్లడిస్తున్నాయి. ఆమె సంస్థ భారత్‌లోని దిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని విచారించగా... షెహజాద పాత్ర వెలుగులోకి వచ్చింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్ సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, సైన్యం నుంచి ఆమెకు స్పష్టమైన సూచనలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. భారత్‌లోని దాదాపు 3 వేల మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూదిల్లీలోని పాకిస్థాన్ దౌత్యకార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడి ఉంది. అక్కడి ఫస్ట్ సెక్రటరీ (వీసా) సుహైల్ కమర్, కౌన్సిలర్ (ట్రేడ్) ఉమర్ షేయర్‌తో మంచి సంబంధాలున్నాయి. ఆమె నుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా అధికారిగా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్ రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ లేదా స్పాన్సర్‌షిప్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసా వచ్చేసేది.

విశాలాంధ్ర హైదరాబాద్

దేశచరిత్రలో వికలాంగుల సంక్షేమానికి మైలురాయి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వికలాంగులకి వికలాంగుల కార్పొరేషన్ ద్వారా ఉచితంగా అందించే సహాయ ఉపకరణాలుకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలును ప్రకటిస్తూ జీఓ.89 జారీ చేయడం పట్ల వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి, సీతక్కలకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలోనే మొదటి సారిగా బెంచ్ మార్క్ వైకల్యం (40శాతం) కే ఇక నుండీ ఎయిడ్స్, అప్లియెన్స్‌లు అందించేలా చట్టం చేయడం దేశ చరిత్రలో వికలాంగుల సంక్షేమ మైలురాయి అన్నారు. 2016లో ఈ అంశం ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం గత ప్రభుత్వం అ దిశగా అడుగులు వేయలేదని విమర్శించారు. కేంద్రానికి అనుబంధ వ్యవస్థ అయినా అలింకో సంస్థ కూడా 80శాతంకు లోపు ఉంటే ఏ సహాయ ఉపకరణం వికలాంగులకి ఇవ్వడం లేదన్నారు. అటు బిజెపి పాలిత రాష్ట్రాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఈ అంశం పట్టించుకోలేదని ఇప్పటికైనా కేంద్రంతో పాటు మిగిలిన అన్ని రాష్ట్రాలు తెలంగాణని ఆదర్శంగా తీసుకొని వెంటనే అమలు చేస్తూ జీవోలు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.

ఆసక్తిగా కదిలే సర్వైవల్ థ్రిల్లర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జురాసిక్ వరల్డ్ త్రయం బిలియన్ డాలర్ల విజయం తర్వాత, ఐకానిక్ ఫ్రాంచైజీ కొత్త దిశలో తిరిగి ప్రాణం పోసుకుంది. యూనివర్సల్ పిక్చర్స్ గర్వంగా జురాసిక్ వరల్డ్ రీబర్త్‌ను ప్రదర్శిస్తుంది. దార్శనికుడు గారెత్ ఎడ్వర్డ్స్ (రోగ్ వన్) దర్శకత్వం వహించగా అసలు జురాసిక్ పార్క్ రచయిత డేవిడ్ కోప్ రాసిన ఈ సినిమాటిక్ దృశ్యంలో ప్రపంచ సూపర్ స్టార్ స్కార్లెట్ జోహన్సన్, ఎమ్మీ నామినీ జోనాథన్ బెయిలీ, రెండుసార్లు ఆస్కార్‌కు విజేత మహర్షలా అలీ అంతర్జాతీయ ప్రముఖులు రూపర్ట్ ఫ్రెండ్ మాన్యుయెల్ గార్సియా-రుల్ఫో వంటి పవర్‌హౌస్ తారాగణం ఉన్నారు. జురాసిక్ వరల్డ్ రీబర్త్ జూలై 4, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి దూసుకుపోతుంది. ఫ్రాంచైజీకి చాలా కాలంగా అభిమానిగా ఉన్న జోహన్సన్, కోప్ రాసిన స్క్రిప్ట్‌కి తక్షణమే ఆకర్షితురాలైన ఆమె మాట్లాడుతూ ఇది ఒక జురాసిక్ సినిమాలా అనిపించిందన్నారు. ఉత్సాహంతో కదిలే అధిక వ్యక్తిగత వాటాలను కలిగి ఉన్న సర్వైవల్ థ్రిల్లర్ అన్నారు. "నేను మొత్తం కథను నా ముఖం మీద పెద్ద చిరునవ్వుతో చదివాను ఎందుకంటే అది చాలా ఊహాత్మకంగా, సరదాగా ఫన్నీగా ఉందని చెప్పారు. తన పాత్రను మరింత లోతుగా తీర్చిదిద్దాలనే ఆసక్తితో, జోహాన్సన్ స్క్రీన్ రైటర్ డేవిడ్ కోప్‌తో కలిసి జోహాన్సన్ జోరాను మరింత అభివృద్ధి చేసిందన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో మొక్కలు నాటిన సీజీటీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: నేడు పర్యావరణ దినోత్సవం సందర్భం గా సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్-సీజీటీ (నగర మిద్దె తోటలు) వ్యవస్థాపక అధ్యక్షులు హర్కర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇ.సరోజ సారధ్యంలో "సేంద్రీయ పద్ధతి ద్వారా పండించిందే తిందాం.. తినేదే పండించుకుందాం" అనే నినాదంతో 70,000 మందికి పైగా సభ్యులతో కొన సాగుతున్న సీజీటీ గత ఐదు సంవత్సరాలుగా ప్రతి పర్యావరణ దినోత్సవం నాడు వివిధ ప్రదేశాలలో మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని విస్తరించే వినూత్న కార్యక్రమాలు చేస్తున్నది. నేడు పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సి.ఆర్ ఫౌండేషన్ ప్రాంగణంలో ఉన్న వృద్ధాశ్రమం వద్ద వివిధ మొక్కలు నాటడం జరిగినది. లక్ష్మణ ఫలం, ప్యాషన్ ఫ్రూట్ మొదలగు పళ్ళ మొక్కలు, రకరకాల కూరగాయల నార్లు, పూల మొక్కలతో పాటు మిరియాలు, ఆల్ స్పైస్, బిర్యాని ఆకు, మునగ, తమలపాకు, కరివేపాకు, ఇన్సులిన్, మల్టీవిటమిన్, మొదలగు ఆయుర్వేద మొక్కలను నాటడం జరిగింది. సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ట్రెజరర్ వి చెన్నకేశవరావు, సిఆర్ పాలిక్లినిక్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాదరావు, డైరెక్టర్ డా.కునంనేని రజనీ, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోసబట్ల కల్పన, మహిళా సమాఖ్య నాయకులు పశ్య పద్మ, ఎస్. జ్యోతి, పడాల నళిని, సభ్యులు వి లలిత, ఎస్ రాజేంద్రరావు, డాక్టర్ గోపీచంద్, వెలువోలు సాంబశివరావు పాల్గొన్నారు. సీటీజీ గ్రూప్ సభ్యులు రమా మోటూరి, స్వాతి, కుసుమ, ధనలక్ష్మి, అఖిలాండేశ్వరి, మాధవి, పావని, అనిత, రాధ, శారద, సౌజన్య, శ్రీలక్ష్మి, అనురాధ, శ్రావణి, శ్రీలత, పద్మజ వాణి, జ్యోతి పాల్గొన్నారు.

గౌతమ్‌నగర్ రైల్వే గేట్ వద్ద ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ ప్రజలకు రైల్వే చక్రబంధం నుండి విముక్తి కలిగించడానికి గౌతంనగర్ రైల్వే గేట్ వద్ద ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం రైల్వే, జిహెచ్‌ఎంసి, జలమండలి, ప్రాజెక్టు అధికారులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవులు గౌతమ్ నగర్ ఆర్.యు.బి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. అధికారులు సమన్వయం చేసుకొని త్వరలో ఆర్‌యుబి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దశాబ్ద కాలంగా నెలకొన్న రైల్వే గేట్ సమస్య నుంచి త్వరలో ప్రజలు విముక్తి చెందుతారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రవి ప్రకాష్, జిహెచ్‌ఎంసి ప్రాజెక్ట్ డి.ఈ సుదర్శన్, ఎలక్ట్రికల్ లైన్మెన్ రమేష్, కన్స్ట్రక్షన్ డి.ఈ బాగయ్య, జలమండలి జిఎం సునీల్ కుమార్, ఏ.ఈ నవీన్, జిహెచ్‌ఎంసి డి.ఈ.ఈ. లౌక్య, ఏ.ఈ.ఈ దివ్య జ్యోతి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సంగీత, నాయకులు మేకల రామ్ యాదవ్, జెఎసి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చేపట్టిన నూతన ఆర్ఓఆర్ భూభారతి చట్టం-2025 అమలులో భాగంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం శంషాబాద్ మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ 2025 చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14 లోపు భూభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. నిర్దీత షెడ్యూల్‌ను అనుసరిస్తూ అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామాలలో అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు రైతులు, ప్రజలు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్ నగర్ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా అటవీ, జీవవైవిధ్య, విస్తృత పర్యావరణ క్షీణత అత్యంత ప్రమాదకరం అని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌లో ప్రపంచంలోనే భారతదేశం నెంబర్ టుగా ఉందని, అందులో దక్షిణ భారత దేశంలో తెలంగాణ నెంబర్ వన్ ఉందని, ఇది ప్రజల జీవితాలు జీవనోపాధికి హాని కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) మరియు ఆల్ ఇండియా తంజీమ్ -ఏ - ఇన్సాఫ్ సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్, బాగ్ లింగంపల్లి, సుందరయ్య పార్క్ వద్ద గురువారం ప్రదర్శన నిర్వహించింది. సయ్యిద్ అజీజ్ పాషా తోపాటు ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రేఖల గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి ప్రభాకర్, నాయకులు ఎ.విజయ లక్ష్మి, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి సురేందర్ ప్లకార్డులు చేతబూని భూమి మనుగడ, మన ప్రాధాన్యత. భూమి అందం మన కర్తవ్యం. ఆకుపచ్చగా ఆలోచించండి, శుభ్రంగా జీవించండి, రేపటి కోసం ఈరోజే భూమిని కాపాడండి అని నినాదాలు చేస్తూ నిర్వహించిన ప్రదర్శన పలువురిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, దేశంలో 2019 నుండి 2022 వరకు 5.8 మిలియన్ చెట్లు నరికివేయ బడ్డాయని, దక్షిణ భారతదేశంలోని తెలంగాణలో అత్యధికంగా 2014 నుండి 2024 వరకు 11,422 హెక్టార్ల అటవీ భూమిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 45 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ఇది నీటి వనరులను, వ్యవసాయం, ప్రజల ఆరోగ్యాలపై ప్రభావితం చేసిందని తెలిపారు.

గ్లోబల్ వార్మింగ్ ను ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం 1997 క్యోటో ప్రోటోకాల్, 2015 పారిస్, సిఒపి-19, బాకు వంటి అంతర్జాతీయ ఒప్పందాలను ఖచ్చితంగా బలోపేతం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో కంచా గచ్చిబౌలి అడవి భూములు రక్షించబడ్డాయని చెప్పారు. గ్రీన్ హౌస్ వాయువుల విడుదల నుండి ప్రపంచాన్ని రక్షించడంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు గిరిజన విద్యార్థిని, విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్ కోటజీ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26వ విద్యా సంవత్సరమునకు బెస్ట్ అవైలబుల్ పథకము నందు హైదరాబాద్ జిల్లాకు (26) సీట్లు కేటాయించడం జరిగిందని 3వ తరగతి నందు (13) సీట్లు, 5వ తరగతి నందు (07) సీట్లు మరియు 8వ తరగతి నందు (06) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ జిల్లా యందు గల గిరిజన తెగలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ జూన్ 17. దరఖాస్తు ఫారాలు జూన్ 09 నుండి జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం 4వ అంతస్తు, స్నేహ సిల్వర్ జూబ్లీభవన్, కలెక్టర్ కాంప్లెక్స్, లక్డికాపూల్, హైదరాబాద్-500004, నందు ఉచితముగా పొందగలరు దరఖాస్తు చేసుకొనుటకు కావలసిన ధ్రువీకరణ పత్రాలు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల యందు బోనఫైడ్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో (లేటెస్ట్), సంవత్సర ఆదాయం రూ. 2.00 లక్షలకు మించరాదన్నారు. అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ఇట్టి అవకాశం సద్వినియోగం చేసుకోగలరని కోరడమైనది చివరి తేదీ జూన్ 7 సాయంత్రం గం.5ల లోగా దరఖాస్తులు తీసుకోబడునన్నారు. చివరి తేదీ తదుపరి వచ్చిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితులలో తీసుకొనబడవన్నారు. మరింత సమాచారం కొరకు 7780568955 లేదా 9849995875 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి సింగరేణిలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం అనే నినాదం తీసుకున్నారని, దీనిని అనుసరిస్తూ సింగరేణి హైదరాబాద్ కార్యాలయం తో పాటు సింగరేణిలోని అన్ని ఏరియాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ సంచలన ప్రకటన చేశారు. ముఖ్యంగా ప్లాస్టింగ్ బాటిల్స్ మొత్తానికే వినియోగించొద్దని స్పష్టం చేశారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి తన సందేశమిచ్చారు. సింగరేణి సంస్థలో ఇప్పటికే పలు రకాల పర్యావరణహిత చర్యలు చేపడుతున్నామని, కొన్నిచోట్ల ప్లాస్టిక్‌ను వాడటం మానేశారని, అయినప్పటికీ ఈ ఏడాది ఇచ్చిన ప్రపంచ పర్యావరణ నినాదాన్ని అనుసరించి సింగరేణి కార్యాలయాలు, గనులు, డిపార్ట్ మెంటులలో ప్లాస్టిక్‌తో తయారు చేసిన బాటిల్స్, ప్లేట్లు, వస్తువులు తదితరాలపై ఇక సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. సంస్థలోని అధికారులను, కార్మికులు, ఉద్యోగులు దీనికి సహకరించాలని కోరారు. పర్యావరణం పట్ల అభిమానంతో తాను ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా 19 వేల మొక్కల్ని నాటానని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని సంస్థ డైరెక్టర్లు, ఇతర కార్మికులు కూడా మొక్కలు నాటడం ప్రారంభించారని ఇది ఎంతో సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం 3 మొక్కలు నాటాలని, అటువంటి ఆసక్తి గల వారికి సింగరేణి సంస్థ ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం సింగరేణి ప్రాంతాల్లో ఎండాకాలం 50 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండేవని, సింగరేణి సంస్థ విస్తారంగా మొక్కలు నాటిన కారణంగా, ఆ మొక్కలు అడవులుగా పెరిగి వాతావరణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పడిపోయాయని పేర్కొన్నారు. దీనిలో భాగంగా పర్యావరణం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి ఛైర్మన్ బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులకు జ్యూట్ బ్యాగుల్ని పంపిణీ చేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డీ.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) ఎస్.వి.రాజశేఖర్ రావు, ఇంకా వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చే అర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలని, చొరవ తీసుకొని వారికి అవసరమైన సలహాలు, సూచనలను అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా గురువారం శామీర్‌పేట్ మండలంలోని పొన్నాల గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డితో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించి రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించాలని, భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలని అన్నారు. సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించుటకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయినట్లు దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకోని, ప్రభుత్వ భూముల పరిరక్షణకై పాటుపడాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన ప్రతి దరఖాస్తుదానికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట్ తహసీల్దారు యాదగిరిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మొయినాబాద్: గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గౌతమ్ కుమార్ అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని తోల్కట్ట, రెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో భూ వివాదాలు చీటికిమాటికి పెరిగిపోవడంతో వాటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజలు పాల్గొని తమ భూవివాద సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదులు, దరఖాస్తులను అందచేయాలని తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు తమ వంతుగా శాయశక్తుల కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. నిర్భయంగా ప్రజలు సమస్యలను ఫిర్యాదు రూపంలో ఇక్కడ తెలియజేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... భవిష్యత్‌ను కాపాడుకుందాం

మంత్రి కొండాసురేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యావరణాన్ని పరిరక్షించుకొని భవిష్యత్ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యావత్ ప్రపంచానికే సవాలుగా మారిని ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం, ప్రజల సంయుక్త కృషి అవసరమని ఆమె తెలిపారు. మనందరం కలిసి మన పర్యావరణాన్ని సంరక్షించుకోవాలనే బాధ్యతను ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుర్తు చేశారు. ఇదొక విప్లవాత్మకమైన చర్యగా తాను అభివర్ణిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా స్వయం సహాక బృందాలకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రఅటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరి రవి గుగులోత్ పిసిబీ బోర్డు మెంబర్లు సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మీ, జయదేవ్, పిసిబి ఉద్యోగులు, సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రసూల్‌పుర ఫ్లైఓవర్‌కు భూసేకరణ పూర్తి చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రసూల్ పుర ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిప పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో గురువారం కమిషనర్ సికింద్రాబాద్ జోన్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బస్ స్టాప్‌లను పరిశీలించారు. రైల్వే సరిహద్దు నుండి 24 మీటర్ల వరకు భూమి అవసరం ఉందని అధికారులు కమిషనర్‌కు తెలియజేశారు. బస్ స్టాప్‌కు ప్రత్యామ్నాయ భూమిని కేటాయించి దానిని తరలించాల్సిన అవసరం ఉందని ప్రాజెక్ట్ ఎస్.ఇ. శ్రీనివాస్ కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా కమీషనర్ హెచ్ సిటీ ద్వారా రసూల్‌పుర వద్ద చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణ స్థలాన్ని వెంటనే పరిశీలించి భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నాచారంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - కాప్రా : ఉప్పల్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గం ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నాచారం డివిజన్లో సీసీ రోడ్లో, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నాచారం డివిజన్లోని సాయినగర్లో మిగిలి ఉన్న భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించడం అయినది. అలాగే ఇందిరానగర్ వీధి నెంబర్ 11, 12లలో కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు 25 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. ఏఈ కీర్తి, వినీత్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్, జలమండలి సిబ్బంది, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఇందిరానగర్ వాసులు హాజరయ్యారు.

ఆశీర్వాద్ ఆటా ప్రచారకర్తగా నటి స్నేహ

విశాలాంధ్ర - వరంగల్: భారతదేశపు ప్రముఖ గోధుమ పిండి బ్రాండ్‌గా పేరుగాంచిన ఆశీర్వాద్ ఆటా దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో 'క్వాలిటీ సర్టిఫికెట్' ప్రారంభంతో 'నాణ్యత హామీ'ని పునర్నిర్వచిస్తోందని ఐటీసీ ఫుడ్స్ స్టేపుల్స్, అడ్జసెన్సీస్ అధికారి అనుజ్ కుమార్ రుస్తగి చెప్పారు. 'నాణ్యత హామీ పేరుతో గురువారం నూతన టీవీసీను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశీర్వాద్ తమ దీర్ఘకాల సంబంధంతో ప్రసిద్ధి చెందిన నటీమణి స్నేహాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా పునఃపరిచయం చేసిందన్నారు. దక్షిణ భారతదేశం అంతటా చాలా కుటుంబాల్లో సర్వ సాధారణంగా ఉపయోగించే పదార్థం ఆటా కాబట్టి, తమ కుటుంబం కోసం ఉత్తమమైన ఉత్పత్తిని ప్రజలు ఎంపిక చేయడాన్ని నిర్ధారించడానికి సేకరణ నుండి ప్యాకేజింగ్ వరకు వివిధ నాణ్యతా ప్రమాణాలను నెరవేర్చే సరైన ఉత్పత్తిని ఎంచుకోవడం తప్పనిసరి అన్నారు. ఆశీర్వాద్ ఎల్లప్పుడూ తమ వినియోగదారులకు రాజీలేని నాణ్యతను అందిస్తుందని, ప్రతి ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా ప్యాక్ ఇప్పుడు క్వాలిటీ సర్టిఫికెట్‌తో అందజేస్తున్నామన్నారు. ఆశీర్వాద్‌తో, శ్రేష్టతకు హామీ చేకూరడమే కాకుండా భరోసా కూడా ఇవ్వబడుతుందన్నారు. గోధుమపిండి స్వచ్ఛత 100 శాతం గోధుమ పిండి 0 శాతం మైదా కలిగి ఉండి, పోషకాహార విలువలు, ఫైబర్ ప్రోటీన్‌తో ఆశీర్వాద్ వారి 'క్వాలిటీ సర్టిఫికెట్' తెలియచేస్తుందన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గురజాల వారి కోర్టులో

హెచ్.ఎం.ఓ.పి నెంబర్ 72/2024

మధ్య

ముదిగొండ వీరబ్రహ్మచారి - పిటీషనర్

మరియు

ముదిగొండ రవళి - రెస్పాండెంట్

టు,

ముదిగొండ రవళి, భర్త వీర బ్రహ్మచారి, తండ్రి చలపాక అంజనేయ ప్రసాద్, వయస్సు 37 సంవత్సరములు, ప్రైవేటు ఎంప్లాయ్, ఆర్/ఓ. డోర్ నెంబర్ 509, అష్టలక్ష్మి గుడి దగ్గర, కమలానగర్, వనస్థలిపురం, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం. సెల్: 8106825996, 9908641426.

పై నెంబరు పిటీషన్ విడాకుల నిమిత్తం మీ పైన దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ ది.20-06-2025వ తేదీకి మీ హాజరు నిమిత్తము వాయిదా వేసియున్నారు. సదరు తేదీన మీరు స్వయంగా గాని అడ్వకేట్ ద్వారా గాని ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలసి ఉన్నది. లేనిచో మీ వరోక్షమందున పిటీషన్ తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ : 20-06-2025

చల్లా రామిరెడ్డి. ఎస్ శ్యామలాదేవి.
పిటీషనర్ తరఫు న్యాయవాదులు.
గురజాల, సెల్ నెం : 9441409796

భూభారతితో సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - కొత్తూరు : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరిచిన భూభారతి చట్టంతో ధరణి వల్ల ఎదుర్కున్న రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యెల్లారం శేఖర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రెవెన్యూ సదస్సు మూడో రోజు సిద్ధాపూర్ గ్రామంలో తాసిల్దార్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్వోకు అర్జీ పెట్టుకున్నారు. 91 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ దరఖాస్తులను పై అధికారులకు సమర్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసిల్దార్ రవీందర్ రెడ్డి అన్నారు.

పార్టీ నేతలంతా సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త సమర్ధవంతంగా తీసుకెళ్లాలని టీపీసీసీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లు సూచించారు. పథకాల ప్రభావం క్షేత్ర స్థాయిలో స్పష్టంగా కనిపిస్తుందని, ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని రాబోయే ఎన్నికల్లో అనుకూలతగా మలుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా పార్టీ నేతలంతా సమన్వయంతో పనిచేయాలని అప్పుడే పార్టీ కార్యక్రమాలు ముందుకు సాగుతాయని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు సూటిగా వివరించాలన్నారు. సీనియర్లు - జూనియర్లు సమన్వయంతో ముందుకెళ్లాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దేశాన్ని ఆశ్చర్యపరిచే విధంగా రాష్ట్రంలో పథకాలు అమలవుతున్నాయని, కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్న బియ్యం పంపిణీ, భూ భారతి పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందన్నారు. 17 నెలల పాలనలో ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవలసిన అవసరం ఉందని సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేలపై ప్రభావం ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మీనాక్షి నటరాజన్ తెలంగాణ ఇంచార్జ్‌గా రావడం మనందరి అదృష్టమని, చురుకైన నాయకుల్ని పీసీసీ అబ్జర్వర్లతో గుర్తించి తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలతో అనుసంధానంగా పని చేయాలని, పార్టీకి ప్రభుత్వానికి నాయకులు వారధిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేంపల్లి నరేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయి అవార్డు

విశాలాంధ్ర -తుర్కయంజాల్ : తుర్కయాంజల్ పురపాలక సంఘానికి రాష్ట్ర స్థాయిలో వేస్ట్ మేనేజ్మెంట్ విషయంలో అత్యుత్తమ పనితీరు, పరిశుభ్రత పౌర సేవలు కనబరిచినందుకు గాను ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా తుర్కయాంజల్ పురపాలక సంఘ కమీషనర్ అమరేందర్ రెడ్డి అవార్డును అందుకున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని, తుర్కయంజాల్ మున్సిపాలిటి రాష్ట్ర స్తాయి అవార్డు ఎందుకోవడం సంతోషం అని అన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర -కుత్బుల్లాపూర్: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి గాజులరామారం బాలాజీ లేఔట్‌లో శ్రీశ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా పాల్గొని వేద పండితుల ఆశీర్వచనల మధ్య స్వామివారి ఆశీస్సులు పొంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గాజులరామారం బాలాజీ లేఔట్‌లో కాలనీవాసుల మానసిక ప్రశాంత కోసం, నూతన దేవాలయం నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని, దేవాలయలలో రాజకీయ, కుల, మత బేధాలు లేకుండా మానసిక మనుగడకు మందిరాలే ముఖ్య మార్గమని తెలిపారు. అనంతరం నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన ఎల్లప్పుడు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు చౌదరిగారి బుచ్చి రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అంజన్న, వెంకటేశ్వర్లు, తీర్మాల్, వేణు, కళ్యాణ్, నాగరాజు, ధర్మ శ్రీధర్‌లతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల డీఏలు, మెడికల్ బిల్లులు, హెల్త్ కార్డులు ఇప్పించడానికి టీఎన్జీవోస్ రాష్ట్ర సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాధించడానికి కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ అన్నారు. రాజేంద్రనగర్ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇటీవల గెలిచిన వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో కలసి రాజేంద్రనగర్ పుర వీధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. నగర కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శి రాజకుమారి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ యాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాం, ఉపాధ్యక్షులు ఎం.దశరథ్, సంయుక్త కార్యదర్శి జి.పరమేశ్. కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ రవీందర్రెడ్డి పాల్గొన్నారు.

మిల్లెట్స్, ది బెస్ట్ ఫుడ్- ప్రగతి ఉత్సవ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : న్యూట్రిహబ్ సీఈవో డా. జె. స్టాన్లీ "మిల్లెట్స్, ది బెస్ట్ ఫుడ్ - ప్రగతి ఉత్సవ దినోత్సవం" పోస్టర్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ ప్రాంగణంలో విడుదల చేశారు. న్యూట్రిహబ్ - టీబిఐఎస్‌సీ, ఇది సైన్స్, టెక్నాలజీ విభాగం (డిఎస్‌టి), భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న టెక్నాలజీ బిజినెస్ ఇన్క్యుబేటర్, ఐసిఎఆర్- ఐఐఎంఆర్, హైదరాబాద్ హోస్ట్ చేస్తోంది. ఇది దేశంలోనే మొదటిసారి మిల్లెట్ స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఏర్పడిన ప్రత్యేకమైన కేంద్రం. ఈ కార్యక్రమంలో డా.స్టాన్లీ మాట్లాడుతూ, www.millets.news చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. భవిష్యత్తులో కలిసి పనిచేసే అవకాశం ఉందని చెప్పారు. మిల్లెట్స్.న్యూస్ ఛైర్మన్ ప్రసన్న శ్రీనివాస్ శరకడం తో మాట్లాడుతూ, మిల్లెట్ వినియోగాన్ని పెంచేందుకు మిల్లెట్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను బలోపేతం చేయడంలో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్న శ్రీనివాస్ శరకడం మాట్లాడుతూ ఇకపై ప్రతి సంవత్సరం జూన్ 5న "ప్రగతి ఉత్సవ దినోత్సవం" దేశవ్యాప్తంగా జరుపుకుంటామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న మిల్లెట్ తయారీదారులు, ఎంటర్‌ప్రెన్యూర్స్ మరియు రైతులు అందరూ ఈ ఉత్సవంలో భాగస్వాములు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ఏ కౌన్సిల్ కోఆర్డినేటర్ డా.మోనికాస్రవంతి, న్యూట్రిహబ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ అంకితఉపాధ్యాయ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) డా.మల్లేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) డా.మల్లేశ్వరి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కేవలం ఒకరోజు కార్యక్రమం కాదని, ప్రతి రోజు మన జీవితంలో ఒక భాగంగా ప్రకృతిని మనం భావించాలని, చెట్ల పెంపకం, ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి మార్గాల ద్వారా మన భూమిని హరిత భూమిగా మార్చాలని, పర్యావరణ రక్షణకు అందరం కలిసికట్టుగా ముందడుగు వేయాలన్నారు. మల్కాజిగిరి డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.శోభారాణి మాట్లాడుతూ... ప్రకృతిలో ప్రతి అంశం మన జీవన శైలికి అంతర్భాగం అని, చెట్లు, నీటి వనరులు, గాలి ఇవన్నీ మనకు ప్రకృతి ఇచ్చిన అమూల్యమైన బహుమతులన్నారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్-జాతీయ దోమ వ్యాధుల నియంత్రణ కేంద్రం డా.శ్రీదేవి మాట్లాడుతూ గాలి, నీరు, నేల అనే పంచభూతాలు మన అసలైన సంపదలన్నారు. ఆఫీసు సూపరింటెండెంట్ మొహమ్మద్ సలీం, హెల్త్ సూపర్వైజర్ ఎర్రగిన్నెల విజయ్, కార్యాలయ సిబ్బంది, ప్రైవేట్ ఆరోగ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ అభిషేక్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్న మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి పంచభూతాలు, ప్రకృతిలో మనం బాధ్యతగా ఉంటే ప్రకృతి మనల్ని బాగా చూసుకుంటుంది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, లత, రోజా, నాయకులు సయ్యద్ గౌస్, సంఘు, దేవేందర్, అమన్, బాలరాజు సాగర్, సందీప్ ముదిరాజ్, నవీన్ ముదిరాజ్, నర్సింహ గౌడ్, టోనీ, విజయ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని గోల్డెన్ తులిప్ కాలనీలో డీసీ ప్రశాంతి, కార్పొరేటర్ హమీద్ పటేల్, కాలనీ వాసులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గోల్డెన్ తులిప్ కాలనీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం చాలా సంతోషకరమైన విషయం అని, ఇతర కాలనీ లకు ఆదర్శంగా నిలిచారు అని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో కనీసం ఒక్క మొక్క నాటాలన్నారు. మొక్కలను నాటి వాటిని వదిలివేయకుండా వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకొని తల్లి పిల్లను పెంచి పోషించినట్టు మొక్కను వట వృక్షంలాగా పెంచి పోషించాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఆర్‌పీ భరత్, విద్యాసాగర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ప్లాస్టిక్ వలన పర్యావరణానికి మానవాళికి నష్టం జరుగుతుంది అని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడంపై దృష్టి పెట్టాలని మాజీ కౌన్సిలర్ హరిత యాదగిరి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నాలుగవ రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అధికారులు వివిధ శాఖల కార్యలయ సిబ్బంది మన్నెగూడ నందు ర్యాలీ నిర్వహించి పార్క్ స్థలం లో చెట్లు నాటారు. తడి చెత్త పొడి చెత్త, ప్లాస్టిక్ నిర్మూలన హానికరమైన చెత్తల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం చేయడం జరిగినది. స్థానికులు, మున్సిపల్ డిఈఈ, ఆర్ఓ, ఎస్ఐ, ఆర్ఐ, వార్డ్ అధికారులు, బిల్ కలెక్టర్‌లు, జవాన్‌లు, పరిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - అమనగల్లు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో కుసుమ మాధురి అన్నారు. గురువారం ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీడీవో మొక్కలను నాటారు. చెట్లతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. అందరూ మొక్కలను నాటి, పరిరక్షించాలని సూచించారు. అడవులను కాపాడుకోవాలని, మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని కోరారు.

విశాలాంధ్ర - అమనగల్లు: పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కల్వకుర్తి గ్రీన్ ఇండియా చాలెంజ్ ఇంచార్జి లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకులు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు కల్వకుర్తి నియోజకవర్గం, కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలో కల్వకుర్తి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఇంచార్జ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, వన ప్రేమికులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమంలో బాధ్యతగా పాల్గొనాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణా చారి, సిద్ధి గారి వెంకటేష్, జల్కం నాగార్జున, మహమ్మద్ ఇర్షాద్, అమృతం పాండు, కొప్పు కృష్ణ, సిద్ది దాసు, పోతగాళ్ల మహేష్,వగ్గు మహేష్, సిద్దిగారి సురేష్, కంబాల శ్రీకాంత్, గురిగళ్ళ కృష్ణ, గంజి చందు, రాయికంటి సురేష్, కరుణాకర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : సృజనాత్మకతను సామాజిక బాధ్యతతో మిళితం చేస్తూ, టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ ఆధ్వర్యంలో ఓ వినూత్నమైన, ఉపకరమైన పర్యావరణ ప్రచారానికి శ్రీకారం చుట్టింది. మహావీర్ హాస్పిటల్‌తో కలిసి చేస్తున్న ఈ చొరవ ప్రతీ రోజు ప్రారంభాన్ని పచ్చదనంతో ప్రారంభించేలా ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, మసాబ్ ట్యాంక్‌లోని మహావీర్ హాస్పిటల్ దంత విభాగం ద్వారా పర్యావరణహితమైన బాంబూ (వెదురు) టూత్‌బ్రష్‌లు, దీనిపైన అవగాహన కల్పించే సమాచార కరపత్రాలను రోగులు, సందర్శకులకు పంపిణీ చేయనున్నారు. ఈ ప్రయత్నం ద్వారా ప్రతి ఉదయాన్ని 'మైండ్‌ఫుల్ మార్నింగ్'గా మలచుకునేలా ప్రజలకు చైతన్యం కల్పించడమే లక్ష్యం. టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ ఆధ్వర్యంలో పొందించి ప్రారంభించబడి, మహావీర్ హాస్పిటల్ సహకారంతో విజయవంతంగా అమలుపర్చుతున్న ఈ ప్రచారం., "ప్రతి సంవత్సరం లక్షలాది మంది వినియోగిస్తున్న ప్లాస్టిక్ టూత్ బ్రష్‌లు లోతట్టు ప్రాంతాలు సహా మహాసముద్రాలలోకి చేరుతున్నందున పర్యావరణంపై వాటి హానికరమైన ప్రభావాన్ని హైలైట్ చేయడమే" లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆలోచన కేవలం దంత ఆరోగ్యానికే కాకుండా, పర్యావరణ ఆరోగ్యాం, పరిశుభ్రతకీ సైతం సంబంధించిది" అని టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రేఖా ఒస్వాల్ తెలిపారు.

విశాలాంధ్ర-మొయినాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దేవీరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అమ అమ్డాపూర్ గ్రామంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మొక్కలు నాటడం మూలంగా వర్షం కురవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మేడిపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం ఉదయం పీర్జాదిగూడ మినీ ట్యాంక్ బండ్ నుండి జ్ఞానజ్యోతి కళాశాల వరకు జరిగిన ర్యాలీలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కమీషనర్ త్రిలేశ్వర్, డిఈ.సాయినాథ్, మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్, నాయకులు అలువాల దేవేందర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, ప్రశాంత్, మహిళా సంఘాలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దుండిగల్: భవితరాల మేలు కోసం సామాజిక బాధ్యతగా ప్రతి ఒకరూ మొక్కలు నాటాలని, వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా అమృత్ 2.0లో నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ పెద్ద చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ వన మహోత్సవం కార్యక్రమాని నిర్వహించారు. అదే విధంగా మల్లంపేట్ నందు కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మున్సిపల్ సిబ్బందితో కలిసి "స్వచ్చత ర్యాలీని" చేపట్టారు. అనంతరం వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ముందే తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి ఇంటికి వచ్చే స్వచ్చత ఆటోకి అందించాలని, బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయవద్దని, అలా వేసిన వారిపైన జరిమానా విధిస్తామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి పబ్లిక్ టాయిలెట్లు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని,మున్సిపల్ రోడ్స్, డ్రైనేజీలు బాగు చేయాలని వివరించారు. మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, రెవిన్యూ ఆఫీసర్ ప్రభాకర్, మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు మెప్మా మహిళ గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొత్తూరు : మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు అందరు బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగ గురువారం కొత్తూర్ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో 100 రోజుల ప్రణాళిక ప్రతిజ్ఞ, ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. వాతావరణ మార్పులు, కాలుష్యం గ్లోబల్ వార్మింగ్ నుంచి భూమిని కాపాడేందుకు చెట్లు నాటడం, నీటిని ఆదా చేయడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడమే సరైన మార్గం అని సూచించారు. మున్సిపల్ కమీషనర్ ఎన్.బాలాజీ, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు బ్యాగరి ప్రసన్నలత యాదయ్య, మాదారం నర్సింహా, జె అనిత శ్రీనివాస్, మునిసిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : పర్యావరణ పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ అనేది సామాజిక భాధ్యత గలిగిన ప్రతిఒక్కరిపై ఉన్నదని పిపిఏపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మోత్కూర్ మల్లేష్ జవహర్ నగర్ ప్రజలకు పిలుపునిచ్చారు. జూన్ 5 గురువారం, పర్యావరణ పరిశుభ్రత, ఆరోగ్య రక్షణ సమితి (పిపిఏపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు అయిన గందమల్ల యాదయ్య అధ్యక్షతన మేడ్చల్, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో గల బాలాజీనగర్, దళిత సంక్షేమ భవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సభ సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. మనచుట్టూ ఆవరించుకున్న గాలి, నీరు, వెలుతురులను బట్టి ఉన్న వాతవరణాన్నే పర్యావరణం అంటారని గుర్తుచేశారు. రాబోయే తరానికి మంచి సమాజంతో పాటు ఆరోగ్యం, శుభ్రత కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి, పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు ప్రతినబూనాలన్నారు. బిఎస్పీ బీరు యాకస్వామి, మహిళా విభాగం సుప్రియరెడ్డి, పిఓడబ్ల్యు(విముక్తి) పెర్క సునీత, బీసి సామాజిక నేత వద్దెర నర్సన్న, ముస్లిం వెల్ఫే అసోసియేషన్ కమిటీ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ ఎం.డి.పాషామియా, బహుజన రక్షణ సమితి విజయ్ శంకర్, ఇష్వా షేక్ షావలి, సందీప్, జి.దాసు, యాదగిరి, కరణ్ తదితరులు పాల్గొని, స్థానిక జవహర్ నగర్‌లోని రాంకీ చెత్త డంపింగ్ యార్డు, పవర్ ప్లాంట్ల వల్ల ప్రజలకు జరుగుతున్న నష్టాలను తెలియజేశారు.

రేషన్‌కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : సన్న బియ్యం ఒకే సారి పంపిణీ చేయనున్నందున రేషన్ కార్డ్ దారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి రేషన్ డీలర్లకు సూచించారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలోని చౌకధరల దుకాణాన్ని పరిశీలించి డీలరు టోకెన్ వ్యవస్థను అనుసరించాలని, ఎంఎల్ఎస్ పాయింట్ల సమన్వయంతో బియ్యం నిల్వల ముందస్తు స్థానాన్ని అనుసరించాలని సూచించారు. మూడు నెలల కాలానికి ఒకేసారి పంపిణీ చేస్తున్నందున ప్రతి షాపులో తగినంత స్టాకును నిల్వలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, సరిపడా స్టాక్ లేని యెడల సత్వరమే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి, తెప్పించుకోనుటకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేశవరం గ్రామంలోని వరి కేంద్రాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా తనిఖీ చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు ఎంతో పాటు పడుతుంటే మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలునిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నాయని ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ బయో డీజిల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు లింగంపల్లి చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోలుపుల నరసింహులుతో కలసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పరంగా పర్యావరణంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలకు క్లుప్తంగా అర్థమయ్యే దిశలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకోవడానికి తమవంతు కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసే దిశగా నిర్ణయం తీసుకోవాల న్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అన్నారు. పర్యావరణంపై ప్రతి స్కూల్, కాలేజీల్లో ఒక పీరియడ్‌ను కేటాయించాలని అన్నారు. తద్వారా పిల్లల నుండి ప్రజలకు ఒక అవగాహన వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకృతి మయంగా మనం మార్చుకోవచ్చన్నారు. సమావేశంలో నర్సింహులు, చక్రధర్, తరుణ్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్నస్వామి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - కొత్తూరు : యాదవుల ఆరాధ్య దైవం మల్లన్న స్వామి అని కొత్తూరు మండల మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణలు అన్నారు. కొత్తూరు మండలం, ఇనుముల్ నర్వ గ్రామంలో గురువారం యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో వారితో పాటు ఎస్బిపల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.1,16,000 వేలు మధుసూదన్ రెడ్డి విరాళం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజయ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవికుమార్ గుప్తా, మాజీ ఉప సర్పంచ్ లు నరసింహారెడ్డి, శ్రీరాములు యాదవ్, దశరత్ నాయక్, ఇంద్రసేనారెడ్డి, గౌడుగురవి, శేఖర్ ముదిరాజ్, సీసీ కెమెరా శేఖర్ ముదిరాజ్, బోకుల రాజు, దయానంద రెడ్డి, గోపాల్ నాయక్, జంగయ్య యాదవ్, రమేష్ యాదవ్, ఏబి శ్రీను యాదవ్, మహేష్ యాదవ్, గుర్రంపల్లి శ్రీశైలం యాదవ్, దానడి శేఖర్ యాదవ్, ఎస్ రాజు యాదవ్, ఎం కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో తొక్కిసలాట బాధాకరం

- భద్రతా వైఫల్యంతోనే యువకుల మరణాలు
- ఉగ్రవాదులతో చర్చలు... మావోయిస్టులతో పంతమా?
- కమ్యూనిస్టులపై చంద్రబాబు వ్యాఖ్యలు బాధాకరం
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: బెంగళూరులో ఐపీఎల్ విజయోత్సవం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో అమాయక యువకులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోని బైరాగిపట్టెడలో గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవనంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ తొక్కిసలాట మృతులకు సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని నారాయణ అన్నారు. అధికారులు ప్రజల భద్రతను పక్కనపెట్టి... నాయకుల చుట్టూ తిరగడం సిగ్గుచేటన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, కమ్యూనిస్టుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ ప్రముఖ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. ఆపత్కాలంలో కమ్యూనిస్టులే అండగా నిలిచిన విషయాన్ని చంద్రబాబు విస్మరించారన్నారు. అవసరం లేకున్నప్పటికీ కమ్యూనిస్టుల ప్రస్తావన తీసుకొచ్చి... కమ్యూనిస్టులను పక్కన పెట్టానని చంద్రబాబు మాట్లాడటమంటే ప్రధాని మోదీకి మరింత దగ్గర కావడానికి ఆయన ఎంత తహతలాడుతున్నారో అర్థమవుతుందన్నారు. సంక్షోభ సమయాల్లో చంద్రబాబుకు కమ్యూనిస్టులు అండగా నిలిచిన చరిత్రను నారాయణ గుర్తుచేశారు. 'టీడీపీకి తొలినాళ్ల నుంచి కమ్యూనిస్టులు మద్దతిచ్చారు. ఇప్పుడు బీజేపీ అవసరాల కోసం కమ్యూనిస్టులను వ్యతిరేకిస్తూ మాట్లాడటం దారుణం' అని మండిపడ్డారు. చంద్రబాబు అవసరాలకు తగ్గట్టు మాట మార్చడం సరికాదని, గత అనుభవాలను గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

కేంద్ర ప్రభుత్వ కుల, జనగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దాన్ని ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఆప కూడదని నారాయణ స్పష్టం చేశారు. అలా చేస్తే పోరాటం తప్పదన్నారు బీసీలకు చట్టసభల్లో తగిన ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులతో శాంతి చర్చలు జరుపుతూ... మావోయిస్టులతో చర్చలకు నిరాకరించడం దుర్మార్గమని నారాయణ విమర్శించారు. 'నక్సల్స్ సిద్ధాంతం ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా ఉంటుంది. వారి హింసను వ్యతిరేకిస్తాం. మావోయిస్టులను భౌతికంగా తుదముట్టించాలనుకోవడం నీచం. నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరపాలి' అని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే నక్సల్స్ లేని రాష్ట్రంగా కాకుండా... సమస్యలు లేని దేశంగా, రాష్ట్రంగా తీసుకొస్తామని ప్రకటించాలని సవాల్ విసిరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను చూసి ప్రధాని మోదీ భయపడుతున్నారని నారాయణ విమర్శించారు. 'అమెరికాలో భారతీయులు, ఇతర దేశస్థులపై ట్రంప్ కఠినఆంక్షలు విధిస్తున్నా ట్రంప్‌తో చర్చించడానికి మోదీ ఎందుకు భయపడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం ఉగ్రవాదులపై పోరు అంటూ మోదీ డ్రామాలాడుతున్నారని నారాయణ ఆరోపించారు. ఏడాది కూటమి పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని నారాయణ చెప్పారు. 'అమరావతి, పోలవరం, ఆర్థిక రాబడిపైనే చంద్రబాబు దృష్టి పెట్టారు. బనకచర్ల ప్రాజెక్టుపై ఆసక్తి కార్పొరేట్ల ఒత్తిడి కారణంగా ఉండొచ్చు. ఇతర పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి' అని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో ఆర్ఎస్ఎస్ అజెండాను మోస్తున్నారని నారాయణ విమర్శించారు. సనాతన ధర్మం గురించి గరికపాటి నరసింహారావు వద్ద పవన్ కల్యాణ్ ట్యూషన్ తీసుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాల్సిందేనన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి... సాగు, తాగునీరు అందించాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో మామిడి రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని, మామిడి రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రానున్న స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి చంద్రబాబు రాయలసీమ ద్రోహిగా మారారన్నారు. తన 15 ఏళ్ల పాలనలో చంద్రబాబు సొంతంగా ఒక్క ప్రాజెక్టుకు పునాది వేయలేదు...ప్రారంభించలేదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.శివారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జల్లా విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఈ బాధ వర్ణనాతీతం: డీకే

బెంగళూరు: విజయోత్సవంలో విషాదం జరగడంపై కర్నాటక ప్రభుత్వం చాలా చింతిస్తున్నదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. తనకు కలుగుతున్న బాధను వర్ణించలేనన్నారు. ఇలా జరుగుతుందని ఊహించలేదని ఆయన గురువారం తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను అనుభవిస్తున్న బాధను మాటల్లో చెప్పలేను. ఇలా జరుగుతుందని ఊహించలేదు. రాష్ట్రం మొత్తం చూస్తుంది. మేము చాలా చింతిస్తున్నాం. ఈ ఘటనకు మన్నించండి' అని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ఈ ఘటనను రాజకీయం చేయాలని అనుకోవడం లేదని, జరిగిన తప్పును సరిదిద్దుకోవాలని, ఈ కష్టసమయంలో బాధిత కుటుంబాల బాధను పంచుకుంటామని, వారు మా కుటుంబంలో భాగమేనని డీకే శివకుమార్ అన్నారు. చిన్న పిల్లలను, వారి కుటుంబాల కష్టం చూస్తే హృదయం ద్రవించిందని, ఆ బాధ తట్టుకోలేకపోతున్నానని కంటతడి పెట్టుకున్నారు. 'ఇది పరిపాలన పరంగా గుణపాఠంగా తీసుకుంటాం. దీనిపై ప్రతిపక్షాలను శవ రాజకీయం చేయనివ్వండి... వారు ఎన్ని శవాలపై రాజకీయం చేశారో జాబితా తయారు చేస్తా' అని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ఇలా జరిగివుండాల్సింది కాదని, ఇంత భారీ సంఖ్యలో అభిమానులు వస్తారని ఊహించలేదని, చిన్న పిల్లలను చూస్తే చాలా బాధగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి అన్నారు. మృతులకు సంతాపసూచికంగా శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రద్దు చేసినట్లు తెలిపారు. కేబినెట్ సమావేశం మాత్రమే జరుగుతుందని డీకే శివకుమార్ చెప్పారు.

ఆర్సీబీ రూ.10లక్షల పరిహారం

తొక్కిసలాటలో చనిపోయిన 11 మంది కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున పరిహారాన్ని ఆర్సీబీ ప్రకటించింది. బెంగళూరులో దురదృష్టకర ఘటన జరిగింది. ఇది ఆర్సీబీ కుటుంబాన్ని బాధించింది. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, మృతులను గౌరవిస్తూ 11 కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటిస్తున్నాం. గాయపడిన వారి కోసం 'ఆర్సీబీ కేర్స్' పేరిట నిధి సమకూరుస్తున్నాం' అని ఆర్సీబీ అధికారిక ప్రకటన పేర్కొంది.

అంధకారంలో 'బర్లీ' రైతు

కంపెనీలపై ఒత్తిడి తెచ్చి కొనుగోలు చేయించాలి

లేకుంటే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి

గుంటూరు ధర్నాలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ప్రభుత్వాల తీరు, కంపెనీల మోసపూరిత వైఖరి కారణంగా రాష్ట్రంలో పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. కార్పొరేట్ శక్తులపై ఉన్న ప్రేమ రైతులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు రైతుకు ఎందుకు చేయడం లేదని నిలదీశారు. ప్రత్యేక పరిస్థితిగా గుర్తించి పొగాకు రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, లేనిపక్షంలో క్రాప్ హాలిడే పరిస్థితులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. అదే జరిగితే కార్పొరేట్ సంస్థల ఆదాయంతో పాటు కేంద్రానికి వచ్చే ఎక్సైజ్ పన్నుకు గండిపడుతుందని స్పష్టం చేశారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై కంపెనీలు చేస్తున్న జాప్యానికి నిరసనగా గుంటూరు సిద్ధార్థనగర్‌లోని జీపీఐ కార్యాలయం వద్ద రైతుసంఘాల సమన్వయ సమితి అధ్వర్యంలో గురువారం భారీ ధర్నా జరిగింది. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గతేడాది 35 మిలియన్ కేజీల పొగాకు సాగు చేసిన రైతాంగం... ఈ ఏడాది 70 నుంచి 80 మిలియన్ కేజీల వరకు సాగు చేశారని చెప్పారు. ధరలు ఆశాజనకంగా ఉండటం, ఇతర పంటలకు మద్దతు ధరలు లేకపోవడం వంటి కారణాలతో చాలామంది చిన్న, సన్నకారు రైతులు నల్లబర్లీ పొగాకు సాగుకు ఆసక్తి చూపారన్నారు. నల్లబర్లీ పొగాకు వేయమని రైతులను ప్రోత్సహించిన కంపెనీలు... పంట చేతికొచ్చిన తరువాత కొనుగోలు చేయకుండా మొహం చాటేయడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. మొదటి రకానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.12 వేలు తగ్గకుండా కొనుగోలు చేయాలని, రెండవ రకం రూ.6 వేలకు కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని కంపెనీలపై ఒత్తిడి చేసి పొగాకు కొనుగోలు చేయించాలని, అలా జరగని పక్షంలో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.300 కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసిందని, అలా కాకుండా రూ.5 వేల కోట్లు కేటాయించి ఉంటే పొగాకు రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు.

జీపీఐ ప్రతినిధులతో చర్చలు

వడ్డే శోభనాద్రీశ్వరరావు నాయకత్వంలో రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు నల్లబర్లీ సాగు రైతుల సమస్యలపై జీపీఐ ప్రతినిధుల బృందంతో సుదీర్ఘంగా చర్చించారు. చర్చలలో జీపీఐ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జితేంద్ర, జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. వివిధ రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, టొబాకో బోర్డు మాజీ డైరెక్టర్, రైతు సంఘం నాయకులు చుండూరి రంగారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సుబాబుల్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ జగన్నాథం, నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, వేల్పూరి నరసింహారావు, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, పాటిబండ్ల కోటేశ్వరరావు, యశ్వంత్, బాబు, ఎన్.రామారావు, ఎన్.వేణుగోపాలరావు, వి.గోపాలరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మేధా పాట్కర్‌పై నిషేధాజ్ఞలు

భువనేశ్వర్: బాక్సైట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న వేళ సామాజిక కార్యకర్త మేధా పాట్కర్‌ను ఒడిశా, రాయగఢ్ జిల్లాలోకి అడుగు పెట్టనివ్వలేదు. ఆమె గురువారం ఉదయం అక్కడి రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే, ప్రవేశాన్ని నిషేధించే ఉత్తర్వులు అందాయి. ఈనెల 4వ తేదీ నుంచి రెండు నెలల పాటు పాట్కర్‌ను రాయగఢ్ జిల్లాలోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ ఆ ఆదేశాలిచ్చారు. నర్మదా బచావో ఉద్యమకారిణితో పాటు మరో 20 మందికిపైగా కార్యకర్తలకు ఇలాంటి నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. ఈ కార్యకర్తలు జిల్లాకు వస్తే శాంతి భద్రతల సమస్యలు వస్తాయని, ప్రజాశాంతికి భంగం కలుగుతుందని, పరిపాలన వ్యవహారాలు సజావుగా సాగలేవని, అభివృద్ధి ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందని సహేతుకమైన ఆందోళనల దృష్ట్యా వారి ప్రవేశాన్ని నిషేధించినట్లు కలెక్టర్ పారుల్ పట్వారీ సంతకంతో ఉన్న ఉత్తర్వులు పేర్కొన్నాయి. కాగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మా మాటి మాలీ సురక్ష మంచ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు మేధా పాట్కర్ రాయగఢ్ చేరుకున్నారు. కానీ ఆమెను అడ్డుకోవడంతో అక్కడ నుంచి గంజాం జిల్లాలోని బెర్హంపూర్‌కు వెళతారని, అలాగే, శనివారం భువనేశ్వర్‌లో కార్యక్రమంలో పాల్గొంటారని పాట్కర్ సహచరుడు నరేంద్ర మహంతీ వెల్లడించారు. తాజా పరిణామంపై మేధా పాట్కర్ విలేకరులతో మాట్లాడుతూ 'నేను రావడంతో ప్రజలకు సమస్యలు వస్తాయనేందుకు నేనేమీ ఉగ్రవాదిని కాను. దేశ పౌరురాలిని. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. సుస్థిర ప్రగతినే డిమాండ్ చేస్తాం' అని అన్నారు. కాగా, మా మాటి మాలీ సురక్ష మంచ్ అధ్వర్యంలో రాయగఢ్, కోరాపుట్ జిల్లాల్లో బాక్సైట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆందోళనలకు కేంద్రబిందువు రాయగఢ్ జిల్లాలోని కాశీపూర్‌లో 240 మంది పోలీసులను మోహరించినట్టు అధికారులు తెలిపారు.

అట్టహాసంగా 'మసులా బీచ్ ఫెస్ట్' ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని మంగినపూడి తీరంలో 'మసులా బీచ్ ఫెస్ట్-2025' అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత బీచ్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతి ఐకానిక్ టవర్‌ను మంత్రి దుర్గేష్, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించి తదుపరి క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీచ్ ఫెస్ట్... పర్యాటకులు, జిల్లావాసులకు వినోదం, ఆహ్లాదం, అన్ని రాష్ట్రాల రుచులను అందించనుంది. విద్యా, సాంస్కృతిక కేంద్రంగా... స్వాతంత్ర్య, రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువుగా నిలిచిన మచిలీపట్నం చరిత్రను గుర్తు చేసేలా మంగినపూడిలో నాలుగు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నెల 5 నుంచి 8 వరకు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, జాతీయ స్థాయిలో సి-కయాకింగ్, కనోయింగ్ బీచ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. 80 అడుగుల అమరావతి ఐకానిక్ టవర్, 100 అడుగుల ఎత్తులో జాతీయ పతాకం శాశ్వత నిర్మాణాలుగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, అనేక మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కాగా, ఇంతకుముందే బీచ్ ఫెస్టివల్‌కు హాజరు కావాలని మంత్రి కొల్లు రవీంద్ర... ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పర్యాటక అభివృద్ధిని కాంక్షిస్తూ బీచ్ ఫెస్టివల్ నిర్వహించడం అభినందనీయమని పవన్ అన్నారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కార్యక్రమంగా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో నిర్వహించే ఈ మసులా బీచ్ ఫెస్టివల్ 2025కు సంబంధించిన ఏర్పాట్లను పర్యాటక శాఖ, ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ, కృష్ణాజిల్లా అధికార యంత్రాంగం కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ బీచ్ ఫెస్టివల్‌లో హెలిరైడ్, పారాగ్లేడింగ్, స్పీడ్ బోటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 22 రాష్ట్రాల నుంచి 4 వేల మంది క్రీడాకారులు పాల్గొంటు న్నారు. ఈ ఫెస్టివల్‌తో మచిలీపట్నం, చిలకలపూడి బీచ్‌లో సందడి వాతావరణం నెలకొంది. పర్యాటకులను ఆకర్షించేలా అనేక రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. కాగా, బుధవారం రాత్రి మంగినపూడి బీచ్‌ను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు కలిసి సందర్శించి వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, ప్రజలు రానున్న నేపథ్యంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తూ 800 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

పాత్రికేయ వృత్తిలో ప్రమాణాల మెరుగుదలకు కృషి: ఆలపాటి సురేశ్ కుమార్

మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

శ్రీనివాసరెడ్డి అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాత్రికేయ వృత్తిలో ప్రమాణాల మెరుగుదలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని, ఇందుకోసం తన వంతు కృషి చేస్తానని సీనియర్ జర్నలిస్టు ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. సీరాఘవాచారి మీడియా అకాడమి చైర్మన్‌గా ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. తనను నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ రెవెన్యూ కాలనీలో మీడియా అకాడమీ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలపై దృష్టి అవసరమని ఆలపాటి సురేశ్ అన్నారు. కొన్ని సందర్భాల్లో ఈ మాధ్యమాలను నియంత్రించాల్సి వస్తుందన్నారు. సరైన సమాచారాన్ని పొందడంలో ఇది ఒక భాగమే కనుక మీడియా అకాడమీ పరిధిలో లేకపోయినా, దీనిపై దృష్టి పెట్టాలని ఆలపాటి సురేశ్ అన్నారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆలపాటి సురేశ్ కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ శ్రీనివాస రెడ్డి అభినందించారు. పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, ఇతర జర్నలిస్టు సంఘాల నాయకులు కూడా ఆలపాటి సురేశ్‌ను అభినందించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, హిందూ రెసిడెంట్ ఎడిటర్ శ్రీరెడ్డప్ప, సమాచార శాఖ మంత్రి అదనపు పీఎస్ డా॥అనిత, శాఖ అదనపు డైరెక్టర్ ఎల్.స్వర్ణలత, సంయుక్త డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, విశ్రాంత అదనపు డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఆయనను సత్కరించారు. నూతన చైర్మన్‌కు అకాడమీ కార్యదర్శి మణిరామ్ స్వాగతం పలికారు. ఆలపాటి సురేశ్‌ను అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్ శాలువాతో సత్కరించారు. వివిధ ప్రాంతాల పాత్రికేయులు కూడా చిరు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్థన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత రాష్ట్రమే లక్ష్యం: సంధ్యారాణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్లాస్టిక్ రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యమని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నారులను భావి భారత పౌరులుగా తయారుచేసే తల్లి స్థానంలో ఉండి సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు కృతజ్ఞతలు తెలిపారు. గత పాలనలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ వరకు యోగా శిక్షణ

స్పీకర్ అయ్యన్న పాత్రుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ స్థాయి వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. అసెంబ్లీ ఆవరణలో అసెంబ్లీ ఉద్యోగులతో కలిసి 'యోగాంధ్ర 2025' కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలను కోరారు. ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని, అందుకే ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మన ఆరోగ్యంతో పాటు మన పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనాన్ని పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, సెక్రెటరీ జనరల్ ప్రసన్న కుమార్, ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్, అసెంబ్లీ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో మునిగి ముగ్గురు చిన్నారుల మృతి

చిత్తూరు జిల్లా మోట్లపల్లిలో ఘటన

విశాలాంధ్ర-వి.కోట: ముగ్గురు చిన్నారులు చెరువులో ఈతకు వెళ్లి మునిగి దుర్మరణం చెందిన ఘటన చిత్తూరు జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వి.కోట మండలం కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లి గ్రామానికి చెందిన పాపమ్మకు కొడుకు ఆదెప్ప, కూతురు కవిత ఉన్నారు. కొడుకు మేస్త్రీ పనికి వెళ్లేవాడు కాగా కుమార్తెను కర్నాటక రాష్ట్రం బంగారు పేట గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. అయితే కవిత మోట్లపల్లిలోని కాలనీలోనే తల్లి పాపమ్మ దగ్గరే ఉంటోంది. వేసవి సెలవులు కావడంతో కవిత కొడుకు కుశాల్, పాపమ్మ కొడుకు ఆదెప్ప పిల్లలు పూర్దేష్, జగన్... అలాగే అదే ప్రాంతంలో ఉంటున్న రెడ్డెప్ప కొడుకు నిఖిల్ నలుగురూ కలిసి గ్రామంలోని చెరువులో ఈతకు వెళ్లారు. చెరువులోని ఓ గుంతలో నిఖిల్, జగన్, కుశాల్ ఈతకు దిగి బురదలో ఇరుక్కున్నారు. నీళ్లలోకి దిగిన ముగ్గురు ఎంతకీ పైకి రాకపోవడంతో వెంట వెళ్లిన పూర్దేష్ గమనించాడు. వెంటనే దిగాలుగా గ్రామం వైపు పరుగెడుతూ వచ్చి అక్కడున్న వ్యక్తులకు సమాచారం అందించాడు. వారు వెంటనే చెరువు వద్దకు చేరుకొని చూడగా ఒకరు చనిపోయినట్లు గుర్తించారు. మరో ఇద్దరు బురదలో కూరుకుపోయి ఉండటం గమనించారు. గుంతలోకి దిగి బురదలో ఇరుక్కొని ఊపిరాడక విగతజీవులైన వారిని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్న అర్బన్ సీఐ సోమశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు ఆదెప్ప, కవిత పిల్లలు, మరొకరు ఇంటి పక్కన నివాసం ఉంటున్న రెడ్డెప్ప కుమారుడు మరణించడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ముగ్గురు చిన్నారుల మృతి విషయం ఫోన్‌లో తెలుసుకున్న జిల్లా ఇంఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ జి.శ్రీనివాసులు, స్థానిక శాసన సభ్యులు ఎన్.అమర్నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు అండగా ఉంటామని అన్నారు. ఇదిలాఉండగా, ఆ చెరువులో కృత్రిమ ఇసుక తయారీ కోసం అదే గ్రామానికి చెందిన కొంతమంది మట్టిని తవ్వడం వల్లే చెరువులో గుంతలు ఏర్పడి వాటిలో బురద చేరుతోందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.